


రాష్ట్రంలో మరో ఆరు రోజులు వర్షాలు

బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. బెంగళూరుతోపాటు దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఆరు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధనశాఖ ప్రకటించింది. ఉత్తర కర్ణాటకతోపాటు అన్ని ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. హాసన్, కొడగు, మైసూరు, శివమొగ్గ, దావణగెరె జిల్లాల్లో ఆదివారం జోరు వాన కురిసింది. కాగా సోమవారం కలబురగి, యాదగిరి, రాయచూరు జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. 14న హావేరి గదగ్, ధారవాడ, బెళగావి జిల్లాల్లో వర్షం కురవచ్చునని సూచించారు.

విద్యాశాఖ.. నిర్లక్ష్యం

- గుర్తింపు లేని పాఠశాలలతో బలవుతున్న విద్యార్థులు
- జాబితాను ప్రకటించడంలో ఆలస్యం
- అధికారుల తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం





గుర్తింపు లేని పాఠశాలల కారణంగా విద్యార్థులు భవిష్యత్తు బలవుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మార్చి నెలలో పలు గుర్తింపు లేని పాఠశాలలు ఉన్నట్లు గుర్తించిన విద్యాశాఖ ఏప్రిల్‌లో జాబితా విడుదల చేస్తామని ప్రకటించినా ఆ దిశగా అడుగులు వేయడం లేదు. ఏటా ప్రైవైట్ పాఠశాలల ధనాశ కారణంగా విద్యార్థులు బలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొనాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): గుర్తింపు లేని పాఠశాల ప్రకటలో విద్యాశాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. విద్యార్థుల భవిష్యత్తును బలిగొంటున్న బడులను నిలువరిం చడంలో అధికారులు విఫలం అవుతున్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర పాఠశాల విద్యకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఏటా డ్రాప్ అవుట్‌ల సంఖ్య గణనీయంగా తగ్గడం, విద్యార్థుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఏటా ఏడో తరగతి, పదో తరగతిలో పరీక్షలు పాస్ అయ్యేవారి సంఖ్య లక్షల్లో నమోదవుతోంది. విద్యార్థులు పెరుగుతున్నందుకు అనుగుణంగా విద్యాసంస్థలు అధికమవుతున్నాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో అనుమతులు పొందకుండానే నిర్వహిస్తుండంపై తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. గుర్తింపు లేని పాఠశాలల కారణంగా విద్యార్థులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన సర్టిఫికెట్లు లేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారు. 2024-25 విద్యాసంవత్సరం మరో రెండు వారాల తర్వాత లాంఛనంగా ప్రారంభం కానుంది. అయితే ఇప్పటివరకు ప్రాంతీయ విద్యాశాఖ అధికారుల కార్యాలయాలనుంచి పాఠశాలల షెడ్యూల్ విడుదల చేయలేదు. దీంతో పిల్లలను పాఠశాలలో చేర్పేందుకు తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. గుర్తింపు పొందిన పాఠశాలల జాబితాను విడుదల చేసేందుకు డెడ్‌లైన్ ముగిసినా విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

గడువు ముగిసినా విడుదల కాని జాబితా

రాష్ట్రంలో 17,329 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 36.34లక్షలమంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్ర విద్యాశాఖ సమాచారం ప్రకారమే 1695 పాఠశాలలు గుర్తింపు లేనివని తెలుస్తోంది. పాఠశాల విద్యాశాఖ ఏప్రిల్ మొదటివారంలో సర్క్యులర్‌ను విడుదల చేసింది. 2024-25 విద్యాసంవత్సరంలో గుర్తింపు పొందిన పాఠశాల జాబితాను 24వ తేదీలోగానే బీఈఓ కార్యాలయాల్లో నోటీసు బోర్డు ద్వారా ప్రకటించాలని సూచించింది. పాఠశాల పాలకమండలులు, రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం పాఠశాలల సమాచారాన్ని 25వ తేదీలోగా ప్రకటించాలని గడువు ఉండేది. విద్యాశాఖ విధించిన గడువు ముగిసి రెండు వారాలు ముగిసినా ఎటువంటి అధికారిక సమాచారాన్ని ప్రాంతీయ విద్యాశాఖ కార్యాలయాలు ప్రకటించలేదు. ఏప్రిల్ 26న లోక్‌సభ తొలి విడత పోలింగ్ ఉందని వాయిదా వేస్తూ వచ్చారు. ఆ తర్వాత రెండో విడత పోలింగ్ ఉన్నాయని సాకులు చూపారు. ప్రస్తుతం రాష్ట్రంలో రెండు విడతల ఎన్నికలు ముగిశాయి. అయినా గుర్తింపు పొందిన పాఠశాలల జాబితా మాత్రం ప్రకటించలేదు. గుర్తింపు లేని పాఠశాలల జాబితాలో రిజిస్ట్రేషన్ లేకపోవడం, విద్యాశాఖ నుంచి అనుమతి లేకపోవడం. రిజిస్ట్రేషన్‌కు అనుగుణంగా కాకుండా తరగతులు పెంచుకోవడం, రాష్ట్ర సిలబస్‌ను అనుమతులు పొందకుండా ఇతర పాఠాలను బోధించడం, అదనపు విభాగాలు ఏర్పాటు చేసుకోవడం, ఒకే భవనంలో రెండు సిలబస్‌ల బోధనలు ఉన్నాయి. ప్రైవైట్ పాఠశాలల ధనాపేక్ష కారణంగా విద్యార్థులు తమ విలువైన భవిష్యత్తును కోల్పోతున్నారు. అయినా అధికారుల్లో చలనం లేకపోవడం విడ్డూరం.

- రాష్ట్ర ప్రైవేట్ విద్యాసంస్థల సంఘటనా కార్యదర్శి డీ శశికుమార్ అభిప్రాయం మేరకు అనుమతులు లేకుండా పాఠశాలలు కొనసాగించడాన్ని వ్యతిరేకిస్తామన్నారు. అయితే విద్యాశాఖ అధికారులు ఇదే అస్త్రంగా పెట్టుకుని ప్రైవేట్ పాఠశాలల యాజమానులను వేధిస్తారని, అవినీతికి ఇది కారణం అవుతోందన్నారు. తప్పు చేసిన విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవడంలో ఎటువంటి అభ్యంతరం లేదన్నారు.





ఉపలోకాయుక్త నియామకం ఎప్పుడో..?



- అవినీతి కట్టడిపై సర్కార్ నిర్లక్ష్యం

బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): అవినీతిని కట్టడి చేసేందుకు కృషి చేసే లోకాయుక్తకు సమగ్రమైన వ్యవస్థ, పర్యవేక్షకుల నియామకంలో ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి. రాష్ట్రంలో లోకాయుక్త ప్రారంభమైనప్పటి నుంచి ప్రభుత్వం ఏదైనా ఇదే తరహాలోనే నిర్లక్ష్యం చేస్తోంది. రెండో ఉపలోకాయుక్త పోస్టు ఖాళీ అయి రెండేళ్లు అవుతున్నా భర్తీ చేయకపోవడం విచిత్రం. కీలకమైన ఉప లోకాయుక్త పోస్టు ఖాళీ ఉంచడం వల్ల లోకాయుక్తతోపాటు అదనపు లోకాయుక్తలపైనే భారం పడుతోంది. బీజేపీ ప్రభుత్వంలో 2022 జూన్ 14న ఉపలోకాయుక్తగా వ్యవహరిస్తున్న మాజీ న్యాయమూర్తి బీఎస్ పాటిల్‌ను లోకాయుక్తగా పదోన్నతి కల్పించింది. అదనపు లోకాయుక్త హోదాలో న్యాయమూర్తి కేఎస్ కేఎన్ ఫణీంద్ర పనిచేస్తున్నారు. గత బీజేపీ ప్రభుత్వంలోనే రెండో ఉపలోకాయుక్త పోస్టును భర్తీ చేయాల్సి ఉండేది. అయితే ప్రభుత్వం అంతగా శ్రద్ధ చూపలేదు. అంతలోనే శాసనసభ ఎన్నికలు రావడం, కోడ్ అమలులోకి రావడంతో నియామకపు ఆలోచనను పక్కన పెట్టేశారు. 2023 మే సీఎం సిద్దరామయ్య సారథ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. కొత్త సర్కారులో ఉప లోకాయుక్తను భర్తీ చేయాలని భావించింది. సాధారణంగా అధికార పార్టీ తరపున సీఎంతోపాటు ప్రతిపక్షనేత కూడా లోకాయుక్తను ఎంపిక చేసే విషయంలో భాగస్వామ్యులు కావాల్సి ఉంది. బీజేపీ అధిష్ఠానం ప్రతిపక్షనేతను ఎంపిక చేయడంలో జాప్యం చేసినందున ఉపలోకాయుక్త నియామకానికి అభ్యంతరం ఏర్పడింది. 2023 నవంబరులో ప్రతిపక్షనేతగా ఆర్ అశోక్‌ను అధిష్ఠానం నియమించింది. ఆ తర్వాత ప్రభుత్వానికి ఏదో ఒక అడ్డంకి తగులుతుండడంతో ఉపలోకాయుక్త నియామకం సాధ్యం కాలేదు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఆ తర్వాత పరిషత్ ఎన్నికల ప్రక్రియ మేరకు కోడ్ అడ్డంకిగా ఉంటుంది. దీనికితోడు హైకోర్టు న్యాయమూర్తి బదిలీ కూడా జాప్యానికి ఒక కారణమైంది.

- 2024 జనవరిలో హైకోర్టు సీజే పీబీ వర్లెను సుప్రీంకోర్టుకు పదోన్నతి కల్పించారు. ఆ తర్వాత కేవలం కొన్ని రోజుల కుమాత్రమే సీజేగా దినేశ్‌కుమార్ వ్యవహరించారు. ఇటీవలి మార్చిలో రెగ్యులర్ సీజేగా ఎన్‌వీ అంజారియా బాధ్యతలు చేపట్టారు. ఉపలోకాయుక్త పోస్టును భర్తీ చేసేలా ప్రభుత్వానికి సూచించాలని హైకోర్టులో న్యాయ పోరాటమే సాగుతోంది. న్యాయవాది ఎస్ ఉమాపతి ప్రభుత్వానికి విన్నవించారు. అనంతరం పిల్ కూడా దాఖలు చేశారు. ఈ మేరకు హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశించినా ప్రతిపక్షనేతల లేనికారణంగా వాయిదాపడింది. ప్రస్తుతం అన్ని సజావు అనిపించినా ప్రభుత్వపెద్దలు ఎన్నికల బిజీలో మునిగితేలుతున్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి బీ వీరప్పన్‌ను నియమించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎన్నికల కోడ్

ఇండియా కూటమి విజయం ఖాయం

మాట్లాడుతున్న డీకే శివకుమార్

- మోదీని నమ్మే స్థితిలో ప్రజలు లేరు: కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్

బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రానుందని డీసీఎం డీకే శివకుమార్ జోస్యం చెప్పారు. కేపీసీసీలో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన బీజేపీ అధికారంలోకి వస్తే నరేంద్రమోదీ కేవలం ఏడాదిమాత్రమే ప్రధానిగా ఉంటారని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వ్యాఖ్యలపై బీజేపీ నేతల ఆగ్రహంపై స్పందించారు. కాంగ్రెస్ కూటమి అధికారంలోకి రానుందని బీజేపీకి చెందినవారు ప్రధాని అయ్యే అవకాశం లేదన్నారు. దేశంలో కాంగ్రెస్ పాలన సాగిస్తుందనే విశ్వాసం ఉందన్నారు. పరిషత్ ఎన్నికలపై ముందస్తు సమావేశం జరిపామన్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాల అభ్యర్థులకు బీఫాంలు అందజేశా మన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడి నుంచి ముఖ్యనేతలంతా కలసి ఎన్నికలలో క్రియాశీలకంగా పనిచేయాలని సూచించామన్నారు. సమష్టిగా పనిచేస్తేనే విజయం సాధ్యమని అభ్యర్థులకు సూచించామన్నారు. లోక్‌సభ ఎన్నికల తరహాలోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తామన్నారు. బీజేపీ - జేడీఎస్‌లు శాశ్వతంగా మైత్రి ఏర్పాటు చేసుకున్నా తమకు అభ్యంతరం లేదన్నారు. విలీనం కూడా చేసుకోవచ్చునని, ఆ పార్టీల నిర్ణయాలతో తమకు సంబంధం లేదన్నారు.

నా పుట్టినరోజు వేడుకలు వద్దు

తన పుట్టినరోజు వేడుకలు ఎవరూ చేసుకోవద్దని డీసీఎం డీకే శివకుమార్ కార్యకర్తలు, నాయకులకు సూచించారు. ఈనెల 15న జన్మదినం ఉందని రాష్ట్రంలో కరువు కారణంగా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. ఇటువంటి సందర్భంలో సంబరాలు సరికాదన్నారు. ఎవరూ వేడుకలు జరుపుకోరాదన్నారు. కటౌట్‌లు, పోస్టర్‌లు, మీడియాలో ప్రకటనలు వద్దన్నారు. మీ అభిమానమే నాకు రక్ష లాంటిదన్నారు. 15న ఎన్నికల ప్రచార నిమిత్తం ఉత్తరభారత్‌కు వెళ్తున్నానని ఎవరికీ అందుబాటులో ఉండడం లేదన్నారు.

బుల్లితెర నటి పవిత్రా జయరాం దుర్మరణం

- హైదరాబాద్ వెళ్తుండగా రోడ్డు ప్రమాదం



పవిత్ర (ఫైల్)

బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ బుల్లితెర నటి, కన్నడ, తెలుగు సీరియల్స్‌లో రాణిస్తున్న పవిత్రాజయరాం (40) ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. మండ్య తాలూకా హనకెరె గ్రామానికి చెందిన పవిత్ర హైదరాబాద్‌లో షూటింగ్ కోసం వెళ్లారు. హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారి తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ సమీపంలోని శేరిపల్లి గ్రామం వద్ద ఈ ప్రమాదం జరిగింది. పవిత్ర ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీ కొట్టి ఇదే ప్రాంతంలో హైదరాబాద్ నుంచి వనపర్తివైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీ కొంది. ప్రమాదంలో పవిత్ర అక్కడికక్కడే మృతి చెందారు. సమీప బంధువు ఆపేక్ష, డ్రైవర్ శ్రీకాంత్, సహ నటుడు చంద్రకాంత్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. కన్నడ 'రోబో ఫ్యామిలీ' సీరియల్ ద్వారా బుల్లితెరపైకి ప్రవేశించారు. ఆ తర్వాత జోకాలి, నీలి, రాధారమణి వంటి సీరియల్స్‌లో మంచి పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం తెలుగులో ప్రసారమవుతున్న త్రినయని సీరియల్‌లో తిలోత్తమ పాత్రను పోషిస్తున్నారు. ఈ సీరియల్ కన్నడలోకి డబ్ చేశారు. పవిత్ర మృతి పట్ల పలువురు నటీ నటులు సంతాపం తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల జోరు..!

- బీజేపీ నుంచి ఐదుగురి పేర్లు..
- కాంగ్రెస్ దక్షిణ ఉపాధ్యాయ అభ్యర్థిగా మరితిబ్బేగౌడ
- టిక్కెట్ల కేటాయింపుతో రగిలిన అసంతృప్తి





మరితిబ్బేగౌడ

బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీల్లో హడావుడి మొదలయ్యింది. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తమ అభ్యర్థుల ప్రకటనలతో జోరు పెంచారు. దక్షిణ ఉపాధ్యాయ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మరితిబ్బేగౌడ పేరును ప్రకటించారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచన మేరకు ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. కాగా బీజేపీ ఐదుగురు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. మరోసారి ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గానికి వైపె నారాయణస్వామి పేరు ఖరారు చేసింది. దక్షిణ ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఈసీ నింగరాజును, ఈశాన్య పట్టభద్రుల స్థానానికి అమరనాథ్ పాటిల్‌ను, నైరుతి పట్టభద్రుల స్థానానికి డాక్టర్ ధనంజయ్ సర్జి, బెంగళూరు పట్టభద్రుల నియోజకవర్గానికి ఆర్ దేవెగౌడ పేర్లు ఖరారు చేసింది. జేడీఎస్ నుంచి నైరుతి ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థిగా మరోసారి ఎస్ఎల్ భోజేగౌడకు అవకాశం కల్పించారు. టిక్కెట్‌ల కేటాయింపుపై కాంగ్రెస్‌లో అసంతృప్తి రగిలింది. కాంగ్రెస్ నేత ఎస్పి దినేశ్ నైరుతి పట్టభద్రుల స్థానం టిక్కెట్‌కోసం తీవ్రంగా ప్రయత్నించానన్నారు. గతంలో పోటీ చేసిన ప్రతిసారి తక్కువ మెజారిటీతో ఓటమి చెందానన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలవాలని ఏడాదిగా కసరత్తు చేశానన్నారు. కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ సూచన మేరకు పది నెలలుగా నియోజకవర్గంలో పర్యటిస్తున్నానన్నారు. అయితే టిక్కెట్ దక్కకపోవడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పట్ల హేళనగా మాట్లాడినవారికే టిక్కెట్ రావడం బాధగా ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారికి మద్దతు ఇచ్చేది లేదన్నారు. కాగా తీరప్రాంత జిల్లాలకు దక్కాల్సిన ఉపాధ్యాయ నియోజకవర్గ టిక్కెట్‌ను శివమొగ్గ వాసికి టిక్కెట్ ఇచ్చారని ఉడుపి మాజీ ఎమ్మెల్యే రఘుపతిభట్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫేస్‌బుక్ ద్వారా తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.

వారి ఓట్లు అలాగే ఉంచేశారు..!



ఎన్నికల నిబంధనల ప్రకారం 18ఏళ్ల నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలి. అయితే అనంతపురంరూరల్ మండలంలోని అధికారులు ఇవే పట్టించుకోకుండా 16ఏళ్లవారికి సైతం ఓటు హక్కు కల్పించారు. మండలంలోని క్రిష్ణంరెడ్డిపల్లిలో ఆధార్‌లో పుట్టిన సంవత్సరాన్ని మార్చి ఓటర్లుగా నమోదు చేశారు. వారి వివరాలను ఆధారాలతో 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. ఈక్రమంలో అధికారులు వాటి తొలంగింపునకు చర్యలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు. అయితే ఇటీవల విడుదలైన కొత్త ఓటరు జాబితాలో వయస్సు తక్కువ వారి ఓట్లను అలానే ఉంచారు. దీనిబట్టి చూస్తే విధుల పట్ల ఆ అధికారులు ఎంత అంకితభావంతో పనిచేస్తున్నారో అర్థం అవుతోంది. - అనంతపురంరూరల్

ప్రలోభాలకు లొంగకండి

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, మే 12 : ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఓటు వేస్తున్న ఓటర్లకు, ఎన్నికలు నిర్వహిస్తున్న సిబ్బందికి ఆయన ఆల్‌ద బెస్ట్ చెప్పారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రశాంత పోలింగ్‌కు అందరూ సహకరించాలన్నారు. పోలింగ్ సిబ్బంది, పోలీసులు సైతం ఒత్తిళ్లకు తలొగ్గకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు చేపట్టామని, 144 సెక్షన్ అమలలో ఉందని పోలింగ్‌కు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటరు కార్డు లేకపోయినా కమిషన్ నిర్దేశించిన 12 రకాల గుర్తింపుకార్డులు చూపించి జాబితాలో పేరు ఉన్నవారు ఓటుహక్కును వినియోగించుకోవచ్చన్నారు. కలెక్టరేట్‌లో పోల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటు చేశామని, ఇక్కడి నుంచే అన్ని పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తామన్నారు. జిల్లాలో 20,18,162 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఇందులో 10,20,124 మంది మహిళలు, 9,97,792 మంది పురుషులు, 246 మంది థర్డ్ జెండర్ ఉన్నారని పేర్కొన్నారు. వందేళ్లు పైబడిన ఓటర్లు 31 మంది ఉండగా, 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 25,211 మంది ఉన్నారన్నారు. తొలి సారి ఓటు హక్కు వినియోగించుకునే యువ ఓటర్లు జిల్లాలో 49,234 మంది ఉన్నారని కలెక్టర్ పేర్కొన్నారు.

బంధువులైతేనే రూ. 2 వేలు..!

చికెన్, పలావ్ అందరికీ



ఎన్నికల వేళ వైసీపీ డబ్బుల పంపిణీలో చిత్ర విచిత్ర సన్నివేశాలు చోటుచేసుకుంటున్నాయి. ఒక్కో ఓటుకు రూ.2వేలు చొప్పున పంచేందుకు అభ్యర్థులు.. వారి నాయకులకు అందజేస్తున్నారు. అయితే ఓటరుకు పంచేటప్పుడు మాత్రం నాయకులు వారి బంధువులైతేనే రూ.2వేలు ఇస్తున్నారు. ఇతరులకైతే రూ.1000 పంచి మిగిలిన మొత్తాన్ని జేబులోకి తోస్తున్నారు. అదేవిధంగా చికెన్, పలావు, బిర్యాని మాత్రం అందరికీ పిలిచిపిలిచి మరీ పెడుతున్నారు. ఓటర్లు ఈ సన్నివేశాలను తలుచుకుంటూ వైసీపీ నాటకాలకు ఓటుతోనే బుద్ధిచెబుతామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - అనంతపురం సెంట్రల్

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేనా..?

వెంటాడుతున్న పోలీసు సిబ్బంది కొరత

కవాతులతో సరిపెడుతున్న పోలీసు అధికారులు

ఎన్నికల వేళ ప్రజల్లో భయాందోళనలు

తాడిపత్రిటౌన్, మే 12: రాష్ట్రంలోనే అత్యంత సమస్యాత్మక నియోజకవర్గాల్లో ఒకటైన తాడిపత్రిలో ఎన్నికల సందర్భంగా ప్రజల భద్రతపై సందేహాలు నెలకొన్నాయి. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఈ ప్రాంతంలో దాడులు, ప్రతిదాడులు, హత్యలు జరుగుతుండడం పరిపాటిగా మారింది. గత ఎన్నికల్లో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు కేవలం కవాతులతో సరిపెడుతున్నారు. పోలీసుల తీరు చూస్తుంటే ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. తాడిపత్రి పేరు వింటేనే ఫ్యాక్షన్, దాడులు, హింసాత్మక సంఘటనలు గుర్తుకు వస్తాయి. సాధారణ రోజుల్లోనే నియోజకవర్గంలో ఎక్కడో ఒకచోట తరచూ గొడవలు జరుగుతూనే ఉంటాయి. నియోజకవర్గంలో తాడిపత్రి, యాడికి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాలు ఉన్నాయి. అసెంబ్లీ, మున్సిపల్, పంచాయతీ ఎన్నికలు ఏవి జరిగినా ఇక్కడ పనిచేసే పోలీసు అధికారుల్లో టెన్షన్ నెలకొని ఉంటుంది. నాలుగు దశాబ్దాల రాజకీయ చరిత్ర కలిగిన జేసీ ఫ్యామిలీ, అదేస్థాయిలో రాజకీయ అనుభవం కలిగిన కేతిరెడ్డి ఫ్యామిలీలు ఎన్నికల్లో ప్రధాన పార్టీల తరఫున పోటీలో ఉండడమే ప్రధాన కారణం. రెండు కుటుంబాలు ఢీ అంటే ఢీ అంటుండడంతోనే ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఎన్నికల పరంపర

తాడిపత్రి అసెంబ్లీ స్థానానికి పోటీపడుతున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారంలోగానీ, రోడ్‌షోల్లో గానీ, నాయకులు, కార్యకర్తల కోలాహలంలో గానీ ఒకరికి మించి మరొకరు పోటీ పడుతుంటారు. గత ఎన్నికలను ఒకసారి పరిశీలిస్తే. 2004 ఎన్నికల్లో టీడీపీ తరఫున కేతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి జేసీ దివాకర్‌రెడ్డి పోటీ పడ్డారు. ఇద్దరూ ఒకేరోజు నామినేషన్ వేయడంతో ఇరువర్గాలు పెద్దఎత్తున రాళ్లు రువ్వుకున్నాయి. దీంతో పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున జేసీ దివాకర్‌రెడ్డి, టీడీపీ నుంచి పేరం నాగిరెడ్డి పోటీపడ్డారు. ఇరువర్గాలు రాళ్లవర్షం కురిపించడంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అప్పట్లో టీడీపీ అభ్యర్థి పేరం నాగిరెడ్డి కాలర్‌ను సీఐ పట్టుకోవడం సంచలనం రేపింది. 2014ఎన్నికల్లో టీడీపీ నుంచి జేసీ ప్రభాకర్‌రెడ్డి, వైసీపీ తరఫున వీఆర్ రామిరెడ్డి పోటీలో నిలిచారు. ఈ ఎన్నికల్లో కూడా ఘర్షణలు, దాడులు చోటుచేసుకున్నాయి. 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున జేసీ ప్రభాకర్‌రెడ్డి కుమారుడు జేసీ అశ్మిత్‌రెడ్డి, వైసీపీ నుంచి కేతిరెడ్డి పెద్దారెడ్డి తలపడ్డారు. ఈ ఎన్నికల్లో పట్టణంలోని గర్ల్స్‌హైస్కూల్ సమీపంలో టీడీపీ అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డిపై వైసీపీ అల్లరి మూకలు దాడులకు ప్రయత్నించడంతో ఏం జరుగుతుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మండలంలోని వీరాపురం గ్రామంలో ఓటింగ్ నిర్వహణ సరిగా లేదని చెప్పిన టీడీపీ కార్యకర్త భాస్కర్‌రెడ్డిని వైసీపీ వర్గీయులు హత్య చేయడంతో అప్పట్లో రాష్ట్రం ఉలిక్కిపడేలా చేసింది. యాడికి మండలం వెంగన్నపల్లిలో టీడీపీ, వైసీపీ వర్గీయులు బాహాబాహీకి దిగి పరస్పర దాడులు చేసుకున్నారు. ఈ సంఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించి టీడీపీ వర్గీయులు 20 మంది, వైసీపీ వర్గీయులు 20 మందిపై కేసులు నమోదు చేశారు. చింతలాయపల్లిలో వృద్ధ ఓటర్లను పోలింగ్ బూత్‌లకు తీసుకువెళ్లే విషయమై టీడీపీ, వైసీపీ వర్గాలు గొడవపడి రాళ్ల దాడిచేసుకున్నాయి. యల్లనూరు మండలం జంగంపల్లి, చింతకాయమంద గ్రామాల్లో ఏజెంట్ల విషయంలో వైసీపీ, టీడీపీ వర్గీయులు దాడి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో నేడు ఎన్నికలు ఎలా జరుగుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్

సిబ్బంది కొరత

రాష్ట్రంలోనే సమస్యాత్మక ప్రాంతమైన తాడిపత్రిలో తగినంతమంది పోలీసు అధికారులను, సిబ్బందిని నియమించడంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. తాడిపత్రిపట్టణ జనాభా దాదాపు లక్షకు పైగా ఉంది, కానీ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య చాలా తక్కువ ఉంది. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నిబంధనల మేరకు సీఐతో పాటు నలుగురు ఎస్‌ఐలు, 46 మంది సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఒక సీఐతోపాటు ఎస్‌ఐ, 10మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వహించడం బట్టిచూస్తే ఈ ప్రాంతంపై పోలీసు ఉన్నతాధికారులు ఎంత శ్రద్ధపెడుతున్నారో అర్థమవుతుంది. తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది పరిస్థితి కూడా ఇలాగే ఉంది. నియోజకవర్గంలోని యాడికి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు పోలీస్‌స్టేషన్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతారా..?

నియోజకవర్గంలో అసాంఘిక, అరాచక శక్తులపై పోలీసు అధికారులు ఉక్కుపాదం మోపుతారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొరవడిన సిబ్బందితో మట్కా, పేకాట వంటి కార్యకలాపాలనే పోలీసులు కట్టడి చేయడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కక్షలు, కార్పణ్యాల మధ్య జరిగే ఈ ఎన్నికలను ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ ప్రాంతంలో పోలీసు ఉన్నతాధికారులు ముందస్తు ప్రణాళిక రూపొందించుకొని అమలుచేయాల్సి ఉండగా ఇప్పటికి అలాంటి కార్యాచరణ మొదలుపెట్టకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గత ఎన్నికల్లో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని పోలీసు అధికారులు అప్రమత్తం కాకుంటే చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా మరోసారి ఘర్షణలకు తాడిపత్రి కేంద్రబిందువుగా మారనుందనడంలో సందేహం లేదు.



ఎస్సీ, ఎస్టీలకు దొంగదెబ్బ..!

ఆయా కాలనీల్లో ఉన్నవారికే ఉచిత విద్యుత్

ఉమ్మడి జిల్లాలో 14వేల కనెక్షన్లకు సబ్సిడీ తొలగింపు

జగన్ పాలనపై బాధితుల ఆగ్రహం



విద్యుత్ శాఖ కార్యాలయం

అనంతపురం రూరల్, మే 12: నా ఎస్సీ, నా ఎస్టీ అంటూ ఆయా వర్గాలను బ్రహ్మాండంగా ఉద్ధరించినట్లు నిత్యం సభలు, సమావేశాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఊదరగొట్టడం చూస్తుంటం. అయితే ఆ వర్గాలకే సడీ చప్పుడు కాకుండా జగన్ దొంగ దెబ్బ వేశాడు. చిన్న మెలిక పెట్టి వారికి ఉచిత విద్యుత్ లేకుండా చేశాడు. టీడీపీ హయంలో ఎస్సీ, ఎస్టీకు ఉచిత విద్యుత్ అందింది. తమ పార్టీ అధికారంలోకి వస్తే 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చాక..నమ్మి ఓట్లేసిన వారినే దెబ్బతీశాడు. దళిత వాడల్లో ఉన్న వారికే ఉచిత విద్యుత్ అంటూ నిబంధన పెట్టి సబ్సిడీ విద్యుత్‌ను తొలగించేశాడు. ఇలా ఉమ్మడి జిల్లాలో 14వేల కనెక్షన్లకు సబ్సిడీ విద్యుత్‌ను విద్యుత్ అధికారులు నిలిపివేశారు. దీంతో ఆయా వర్గాల సభ్యులు ప్రభు త్వంపై మండిపడుతున్నారు. ఎక్కడైనా ఉన్న సబ్సిడీని మరింత పెంచే విధంగా నిర్ణయాలు ఉండాలిగాని..తొలగించడమేటంటూ ఆయా వర్గాల సభ్యులు వైసీపీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీలంటే కేవలం ఆయా కాలనీల్లో మాత్రమే ఉండాలా? మరో చోట ఉండకూడదా? ఇదెక్కడి న్యాయం అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నా ఎస్సీ, నా ఎస్టీ కేవలం మాటలకేనంటూ పెదవిరుస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1.65లక్షల కనెక్షన్లు..

ఉమ్మడి జిల్లా విద్యుత్‌శాఖ పరిధిలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 1.65లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 1.28లక్షలు ఎస్సీలకు కనెక్షన్లు ఉండగా, మరో 36వేల కనెక్షన్లు ఎస్టీలకు సంబంధించినవి. వీటిలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో లేని వారికి సంబంధించిన 14వేల సర్వీసులను గుర్తించారు. వారందరికీ ఉచిత విద్యుత్‌ను తొలగించేసినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇందు లో అనంతపురంలో 5వేల కనెక్షన్లు, కదిరి ప్రాంతంలో పదిహేనువందల కనెక్షన్లు, పెనుకొండ ప్రాంతంలో ఆరువందలు, మడకశిర ప్రాంతంలో 200 కనెక్షన్లు ఇలా ఉమ్మడి జిల్లాలోని ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో లేనివారికి రాయితీ విద్యుత్‌ను నిలిపివేశారు. ఇదేనా జగన్ ప్రభుత్వానికి ఎస్సీ, ఎస్టీల పట్ల ఉన్న చిత్తశుద్ధి అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పోలింగ్ సిబ్బందితో ఆడుకున్న ఆర్వో

అనంత అర్బన్‌లో రాత్రిపూట వెళ్లిపోవాలని హుకుం

నీళ్లు, భోజనం లేక మహిళా సిబ్బంది ఆవేదన

ఓపీఓలకు రూ.500 ఇచ్చి పత్తాలేని అధికారులు

అనంతపురం అర్బన్, టౌన్ 12 : పోలింగ్ సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించామని కలెక్టర్ పదేపదే చెబుతున్నా జిల్లా కేంద్రంలో ఉండే అనంతపురం అర్బన్ ఎన్నికల అధికారులు పోలింగ్ సిబ్బందితో ఆడుకుని నానా ఇబ్బందులకు గురిచేశారు. కనీసం నీళ్లు, భోజనం లేక అవస్థలు పడిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎన్నికల నిర్వహణలో భాగంగా వివిధ నియోజకవర్గాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులను పీఓ, ఏపీఓలు, ఓపీఓలుగా నియమించారు. వారందరికీ రెండుసార్లు శిక్షణ ఇచ్చి ఆదివారం ఎన్నికల డ్యూటీకి రమ్మన్నారు. ఉదయమే ఇక్కడికి చేరుకొని డ్యూటీకి జాయిన్ అయ్యారు. రిజర్వ్‌లో ఉన్నారని, వారికి ఎక్కడ అవసరమైతే అక్కడికి పంపుతామని అందరూ ఉండాలని స్టేజీ మీద ఉన్న ఆర్వో గ్రంధి వెంకటేష్, అసిస్టెంట్ ఆర్వో శివరామిరెడ్డి, ఇతర అధికారులు మైకులో చెబుతూ వచ్చారు. దీంతో దాదాపు వందమందికి పైగా అక్కడే ఉన్నారు. అధికారులు రాత్రి 8 గంటల సమయంలో మీరు అవసరంలేదు..ఇళ్లకు వెళ్లండని చెప్పారు. ఆ సమయంలో అక్కడ ఉన్న గుంతకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం, తాడిపత్రి, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాలకు చెందిన పోలింగ్ సిబ్బంది ఈ సమయంలో ఎలా పోవాలని ప్రశ్నించారు. అందుకు ఓపీఓలకు ఒక్కొక్కరికి రూ. 500 ఇచ్చి వెళ్లి పోండని, పీఓ, ఏపీఓలు ఉండాలని చెప్పి అక్కడున్న ఉన్న అధికారులు మాయమైపోయారు. రాత్రి 9 గంటలైనా నీళ్లు లేవు, భోజనం లేదు, అధికారులు అక్కడికి రాలేదు. దీంతో బిక్కుమొహం వేసుకొని అక్కడే ఉండడం కనిపించింది, కొందరు వెళ్లి పోగా.. మహిళా సిబ్బంది పరిస్థితి ఉండాలా.. ఉంటే ఎక్కడ ఉండాలి అని ఆందోళనగా కనిపించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రిజర్వులో ఉన్న సిబ్బందికి రాత్రి పూట పడుకోవడానికి వసతులు, భోజన ఏర్పాట్లు చేయాలి. అనంతపురం అర్బన్ నియోజకవర్గ ఎన్నికల అధికారులు ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ కనీసం వాళ్లకు నీళ్లు, అన్నం కూడా పెట్టలేదు. మరోవైపు మహిళా సిబ్బంది రాత్రిపూట ఎక్కడికి వెళతారని కనీసం ఆలోచించకుండా ఇలా ఆడుకోవడం ఏమిటన్న ఆరోపణలు వినిపించాయి.



అధికారులు వెళ్లిపోవడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే కూర్చున్న పోలింగ్ సిబ్బంది

చేనేతకు జీఎస్టీ గుదిబండ

వైసీపీ పాలనలో తగ్గిన పట్టుచీరల వ్యాపారం

జీఎస్టీ రీయింబర్స్‌మెంట్‌కు చంద్రబాబు హామీ

అనంతపురం సెంట్రల్, మే 12: పట్టు వస్త్రాలకు గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్(జీఎస్టీ) గుదిబండలా మారింది. వ్యాపారంలో ప్రతి రూ.100కు రూ.5 చొప్పున జీఎస్టీని చెల్లిస్తున్నారు. సంవత్సరానికి పెద్ద మొత్తంలో జీఎస్టీ కడుతున్నామని వైసీపీ ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని వ్యాపారులు మండిపడుతున్నారు. చేనేత వస్త్రాలంటేనే ఖరీదుతో కూడుకున్నవి. తక్కువ లాభంతోనే వ్యాపారాలు చేస్తున్న తమకు జీఎస్టీ గుదిబండలా మారిందని వాపోతున్నారు. తయారీ దారుల నుంచి కొనుగోలుచేసి రవాణా చేయడానికి తడిసిమోపెడు అవుతుంటే అదనంగా జీఎస్టీ కట్టాల్సి వస్తోందని మండిపడుతున్నారు. గత ప్రభుత్వంలో ఎంత మొత్తం సరుకు కొన్నా.. అమ్మంకాని వాటిని తయారీదారులు వెనక్కి తీసుకునేవారు. వైసీపీ ప్రభుత్వంలో జీఎస్టీ అమలుకావడంతో తయారీదారులు వెనక్కి తీసుకోవడంలేదు. అదేవిధంగా ధరలు పెంచారు. దీంతో అమ్మకాలు పూర్తిగా తగ్గిపోయాని వ్యాపారులు అవేదన చెందుతున్నారు.

జీఎస్టీ రీయింబర్స్‌మెంట్‌కు చంద్రబాబు హామీ

ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే పట్టువస్త్రాల వ్యాపారులకు జీఎస్టీ సొమ్మును రీయింబర్స్‌మెంట్ రూపంలో వెనక్కి చెల్లిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. విద్యార్థులకు కళాశాలల ఫీజులు, ఆసుపత్రులకు కట్టే వైద్య ఖర్చులకు చెల్లించే రీయింబర్స్‌మెంట్ లాగా చేనేత వస్త్రాల వ్యాపారులకు జీఎస్టీ మొత్తాన్ని తిరిగి ఇచ్చే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రీయింబర్స్‌మెంట్ హామీ వరం



సరుకు కొనుగోలు మొత్తంలో ఐదు శాతం జీఎస్టీని కడుతున్నాం. ఈ మొత్తాన్ని రీయింబర్స్‌మెంట్ చేస్తామని చంద్రబాబునాయుడు హామీనివ్వడం మాలాంటి వ్యాపారులకు వరం. ఇప్పటికే రవాణా ఖర్చులు పెరిగిపోయాయి. వాటికి అదనంగా జీఎస్టీ చేరడంతో భారంపెరిగింది. దీంతో వ్యాపారాలు తగ్గిపోయి నష్టాల్లో చిక్కుకునాం. రూ.5లక్షల సరుకులో దాదాపు రూ.2లక్షల వరకు వెనక్కి తీసుకునేవారు. జీఎస్టీ కారణంగా తయాదారులు వెనక్కి తీసుకోవడంలేదు.

- అమర్నాథ్, పట్టువస్త్రాల వ్యాపారి, రాచానపల్లి, అనంతపురం మండలం

అమ్మను చూడందే ఉండలేను

మాజీ మంత్రి పరిటాల సునీత

రామగిరి, మే 12: రాజకీయంగా ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎంత పెద్ద కుటుంబంలో ఉన్నా, మా అమ్మ త్యాగాన్ని మరువలేనని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా ఆదివారం మండలంలోని వెంకటాపురంలోని తన నివాసంలో ఆమె తల్లి సరస్వతమ్మ వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. సోమవారం పోలింగ్ ఉన్నప్పటికీ ప్రత్యేకంగా తన తల్లితో కాసేపు గడిపారు. పరిటాల సునీత సోదరి లక్ష్మితో కలిసి తల్లి సరస్వతమ్మ వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ ఎన్నికలలో విజయం సాధించాలని సునీతను తల్లి ఆశీర్వదించారు. అనంతరం పరిటాల సునీత మాట్లాడుతూ...ఆ రోజు గృహిణిగా ఉన్నా, మంత్రి అయినా, ఇప్పుడు రాజకీయాల్లో బిజీగా ఉన్నా నేను ఎప్పుడు మా అమ్మను చూడందే ఉండలేను అన్నారు. బాధ్యతలు ఎలా సమర్థవంతంగా నిర్వర్తించాలో అమ్మ నుంచే నేర్చుకున్నానన్నారు. ఆమె లేనిదే తాను లేను అని ఉద్వేగభరితంగా తెలిపారు.



తల్లితో మాతృ దినోత్సవాన్ని జరుపుకుంటున్న పరిటాల సునీత, సోదరి లక్ష్మి

ఎన్నికలకు ఎమ్మెల్యే బస్సా..?

టీడీపీ నాయకుల అభ్యంతరం



ఎన్నికల సామగ్రిని తరలించడానికి వచ్చిన ఎస్‌ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాల బస్సు

బుక్కరాయసముద్రం, మే12: ఎన్నికల సామగ్రిని తరలించడానికి సిట్టింగ్ ఎమ్మెల్యే బస్సు వాడకున్న సంఘటన ఆదివారం శింగనమల నియోజకవర్గంలో జరిగింది. సోమవారం పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో శింగనమల నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల విధుల కోసం నియమించిన సిబ్బంది, సామగ్రిని తరలించడానికి సిట్టింగ్ వైసీపీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి చెందిన ఎస్‌ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాల బస్సులను ఉపయోగించారు. మండలంలోని వెంకటాపురం గ్రామం పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఎస్‌ఆర్‌ఐటీ బస్సును ఆదివారం రాత్రి వెనక్కి పోవాలని పలువురు టీడీపీ నాయకులు ఆందోళన చేశారు. ఈ విషయం పై నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణీశ్రీ, ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబుల నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెన్నలశీనుకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఎస్‌ఆర్‌ఐటీ కళాశాలకు చెందిన బస్సులను వెనక్కి పంపించారు. ఆ స్థానంలో మరో బస్సును ఏర్పాటు చేశారు.

ప్రలోభాల పర్వం

మహిళా ఓటర్లకు చీరల పంపిణీ



యాడికి, మే12: ఓటర్లను ప్రసన్నం చేసుకోనేందుకు ఆదివారం చివరిరోజు కావడంతో వైసీపీ ప్రలోభాలకు తెరలేపింది. మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు వైసీపీ నాయకులు చీరల పంపిణీ చేపట్టారు. రాయలచెరువులో వైసీపీ నాయకులు చీరలు పంపిణీ చేస్తుండగా టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. చందనలో వైసీపీ నాయకులు చీరల పంపిణీకి తెరలేపారు.

గుడిపాడులో ఘర్షణ

మండలంలోని గుడిపాడులో ఆదివారం తెల్లవారుజామున ఒక వర్గం వారు మహిళా ఓటర్లకు చీరలు పంపిణీ చేస్తుండటంతో మరొకవర్గం వారు అడ్డుకోబోయారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ సంఘటనలో గజేంద్ర అనే వ్యక్తి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. దీనిపై సీఐ నాగార్జునరెడ్డిని వివరణ కోరగా బాధితులు ఇంకా ఫిర్యాదు ఇవ్వలేదని తెలిపారు.

నగరూరులో వైసీపీ ప్రచారం

నగరూరు గ్రామంలో ఆదివారం వైసీపీ నాయకులు మోడల్ ఈవీఎంతో ప్రచారానికి దిగారు. సమాచారం అందుకున్న టీడీపీ వర్గీయులు అడ్డుకోబోయారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వైసీపీ నాయకులు తిరిగి వెనక్కి వెళ్లడంతో టీడీపీ వర్గీయులు శాంతించారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

కూపన్‌లు ఇచ్చారు సరే.. డబ్బులు ఏవీ..?

మంత్రి ఉష శ్రీచరణ్ ఇంటి వద్ద ముస్లిం కుటుంబాల నిరీక్షణ



కూపన్‌లను చూపుతున్న దర్గా ప్రాంతవాసులు

పెనుకొండ టౌన్, మే 12: మంత్రి ఉషశ్రీ చరణ్ ఫొటోతో ఉన్న కూపన్‌లు ఇచ్చారు సరే మరి డబ్బులేవీ అని పలువురు ముస్లింలు మండిపడ్డారు. ఎలాగైనా గెలవాలన్న ఉద్దేశ్యంతో మంత్రి ఫొటోతో ఉన్న కూపన్‌లను ఇంటింటికి పంపిణీ చేశారు. కూపన్ ఉన్న ప్రతి ఒక్కరికి రూ. 1500 చొప్పున ఇస్తామని నమ్మబలికారు. అయితే డబ్బులు ఇవ్వకపోవ డంతో ఆదివారం కూపన్‌లతో మంత్రి ఇంటి వద్ద గంటల తరబడి వేచి ఉన్నారు. ఎంత సేపటికి ఎవరూ స్పందించకపోవడంతో వైసీపీ తీరుపై ఆగ్రహించారు. అయితే అక్కడే ఉన్న వైసీపీ నాయకులు మంత్రి ఇంటి లైట్లు ఆపివేశారు. దీంతో వారు బండబూతులు తిట్టుకుంటూ వెనుతిరిగి వెళ్లారు. పెనుకొండ దర్గా వెనుక భాగంలో ఉన్న ముస్లిం కుటుంబాలకు నాలుగు రోజుల కిందట వలంటీర్ల ద్వారా కూపన్‌లు అందించి, తొందర్లో డబ్బులు ఇస్తామని చెప్పారు. సోమవారం ఓటింగ్ కూడా జరుగనుంది. అయినా ఇంత వరకు తమ ప్రాంతానికి ఎవరూ రాకపోవడంతో తామే ఇక్కడకి వచ్చినట్లు వారు తెలిపారు. కూపన్‌లు ఇవ్వడమెందుకు, మోసం చేయడమెందుకు అంటూ మండిపడ్డారు. సోమందేపల్లి, పెనుకొండ మండలాల్లో కూపన్‌లు అందించిన వారికి డబ్బు ఇవ్వలేక సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నారట. దీంతో ఆగ్రహించిన ఓటర్లు ఎన్నికల్లో తమ సత్తా చూపుతామని ఆగ్రహించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

తంజావూరు బాలసరస్వతి (జయంతి)



పద్మవిభూషణ్ గ్రహీత తంజావూరు బాలసరస్వతి 1918 మే 13న మద్రాస్‌లో జన్మించారు. భారతనాట్య కళాకారిణిగా రాణించడమే కాక కొత్తగా నృత్యం నేర్చుకోదలిచినవారికి తర్ఫీదు ఇచ్చి ప్రోత్సహించారు. కాగా ఆమెకు కొరియోగ్రాఫర్ ఉదయశంకర్ చేయూతనిచ్చి ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శనలకు అవకాశం కల్పించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నారు. సంగీత నాటక అకాడమీ, సంగీత కళానిధి తదితర పురస్కారాల పొందారు. 1984 ఫిబ్రవరి 9న కన్నుమూశారు.

ఆర్‌కే నారాయణ్ (వర్ధంతి)



ఆర్‌కే నారాయణ్‌గా పిలవబడే రాశిపురం కృష్ణస్వామి అయ్యర్ నారాయణ స్వామి 1906 అక్టోబరు 10న చెన్నైలో జన్మించారు. జాతీయస్థాయిలో పేరొందిన రచయిత. 'మాల్గుడి' అనే కాల్పనిక పట్టణాన్ని సృష్టించి అందులోని ప్రజలు, వారి వ్యవహారాల గురించి ధారావాహిక కథలు, నవలలు రాశారు. ఆంగ్లభాషలో భారత సాహిత్య ప్రారంభదశకు చెందిన ముగ్గురు రచయితలలో ఈయన ఒకరు. ముల్క్ రాజ్ ఆనంద్, రాజారావులు మిగిలిన ఇద్దరూ. భారతీయ సాహిత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత ఆర్‌కే నారాయణ్‌కు ఉంది. 'ది గైడ్' నవలకు సాహిత్య అకాడమీ పురస్కారం దక్కింది. ఈ నవల హిందీ, ఆంగ్లంలలో సినిమాగా తీయబడింది. 2001 మే 13న ఆయన కన్నుమూశారు.

రవిశంకర్ (పుట్టినరోజు)



ఆధ్యాత్మిక గురువు రవిశంకర్ 1956 మే 13న తమిళనాడు రాష్ట్రం పాపనాశం అనే ప్రాంతంలో జన్మించారు. శ్రీశ్రీగా, గురూజీ అని, గురుదేవ్ అని భక్తులు ఆయనను పిలుస్తారు. 1981లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్‌ను స్థాపించి సామాజిక చైతన్యం కల్పిస్తున్నారు. బెంగళూరు సెయింట్‌జోసెఫ్ కళాశాలలో బీఎస్సీ పూర్తి చేశారు. తన రెండో గురువు మహర్షి యోగేశ్ యోగితో కలసి ప్రయాణిస్తూ ప్రసంగాలు చేయడం, వేదశాస్త్రాలపై సమావేశాలు నిర్వహించడం, వేద శాస్త్రాలపై సమావేశాలు నిర్వహించడం, ఆయుర్వేద కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఆధ్యాత్మికతపై ఆచరణాత్మక అనుభవ పూర్వక కోర్సులు నిర్వహిస్తున్నారు.

రాబర్ట్ థామస్ ప్యాటిన్సన్ (పుట్టినరోజు)



రాబర్ట్ డగ్లస్ థామస్ ప్యాటిసన్ 1986 మే 13న జన్మించారు. ఆంగ్లంలో విభిన్న పాత్రలకు, బిగ్ బడ్జెట్ సిని మాలకు, ఇండిపెండెంట్ సిని మాలకు ఆయన ప్రముఖుడు. ప్రపంచంలో అత్యధిక రెమ్యూనరేషన్ అందుకుంటున్న నటులలో ఒకరు. 15వ యేటనే సినీ రంగంలో అడుగు పెట్టారు. హ్యారి పోట్టర్, గోబ్లెట్ ఆఫ్ ఫైర్ (2005) సినిమాలతో ఎంతో గుర్తింపు పొందారు. ది ట్విలైట్ సాగా సిరీస్ సినిమాలు ప్రపంచవ్యాప్తంగా పేరొం దాయి. 2022లో బ్యాట్‌మాన్ సినిమా ఎంతో పేరొందిం ది. ఫోర్బ్స్ సెలెబ్రిటీ 100లో చోటు దక్కించుకున్నారు.

శంకరాచార్యులది విశేష స్థానం

» ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్



వేదబ్రహ్మ బాలాజీకి సన్మానం

విజయపుర, మే 12: హిందూ ధర్మంలో ఆది శంకరాచార్యులకు విశేషస్థానం ఉందని ఉపాధ్యాయుడు విజయకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని పురసభ సభాంగణంలో విప్ర సామాజిక వర్గీయులు ఆదివారం ఏర్పాటైన ఆదిశంకరాచార్య జయంతిలో పాల్గొని శంకరాచార్యుల చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మాట్లాడుతూ అనేక నమ్మకాల ప్రకారం ఆదిశంకరాచార్యులను భగవంతుడు పరమశివుడి అవతారంగా పరిగణిస్తారన్నారు. ఆయన జీవితం మానవకులానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన సిద్ధాంతాలతో మనిషి జీవితంలో మార్పులు సాధ్యమన్నారు. పురసభ పర్యావరణ ఇంజనీర్ శేఖర్ మాట్లాడుతూ చిన్నతనంనుంచి వేదాలను చదివి జ్ఞానం పొందారన్నారు. సన్యాసిగా హిందూధర్మ మనుగడకోసం దేశవ్యాప్తంగా సంచరించి ఎంతో కృషి చేశారన్నారు. 32ఏళ్లకే దేహాన్ని త్యజించారన్నారు. అద్వైతసిద్ధాంతాన్ని ప్రతిపాదించి ప్రజలను చైతన్యం చేశారన్నారు. కార్యక్రమంలో వేదబ్రహ్మ బాలాజి స్వామిజీని సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ గోవింద్, ఎస్ సతీశ్‌కుమార్, విప్ర మహిళా సంఘం అధ్యక్షురాలు వీణా ప్రకాశ్, గాయత్రి జగదీశ్, పురసభ పవన్ జోషి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణ రూపకర్తలే భావితరాలకు కీలకం

» బయోకాన్ చైర్మన్ కిరణ్ మజుందార్ షా



వేదికపై బయోకాన్ చైర్మన్ కిరణ్‌మజుందార్ షా, పద్మశ్రీ ఎంకే శ్రీధర్ తదితరులు

బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): విశ్వంలో ఎన్నో సమస్యలు ఉద్భవిస్తున్నాయని వాటిని ఎదుర్కోవడం లేదా శాశ్వత పరిష్కారం దిశగా ఆవిష్కరణలు ముఖ్యమని బయోకాన్ చైర్మన్ కిరణ్ మజుందార్‌షా అభిప్రాయపడ్డారు. చాణక్య యూనివర్సిటీ ప్రాంగణంలో స్కూల్ ఆఫ్ బయో సైన్సెస్‌ను లాంఛనంగా ఆరంభించారు. ఈ సందర్భంగా కిరణ్ మజుందార్‌షా మాట్లాడుతూ భావితరాలకు అవసరమైన ఆవిష్కరణల నాయకత్వాన్ని బయోకాన్ సైన్స్ ల్యాబ్ ద్వారా తయారు చేయనుందని అభిప్రాయపడ్డారు. విద్యాసంస్థలో బయోసైన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులు బయో అంశాలపై సమగ్ర అవగాహన పొందుతారన్నారు. శాస్త్రీయ పరిశోధనల ఆవిష్కరణకు కొత్త సౌకర్యం సాధ్యం కానుందన్నారు. పరిశోధనలు సామూహిక సాధనలో సాగేలా సహకరిస్తామన్నారు. జినోమిక్స్, బయో ఇంజనీరింగ్, డీజిల్ బయాలజీ, కంప్యుటేషన్ బయాలజీ ద్వారా ఆరోగ్యం, వ్యవసాయం, పర్యావరణ సుస్థిరత సవాళ్లను పరిష్కరించేందుకు వీలు కానుందన్నారు. స్వల్పకాలిక కోర్సులు, వర్క్‌షాప్‌లు, సర్టిఫికెట్ కోర్సులు, డిప్లమో కోర్సులు అందుబాటులోకి రానున్నాయన్నారు. కార్యక్రమంలో చాణక్య యూనివర్సిటీ చాన్స్‌లర్, పద్మశ్రీ ఎంకే శ్రీధర్, రిజిస్ట్రార్‌లు హెచ్‌ఎస్ అశోక్, ఎంపీ కుమార్, నాగరాజరెడ్డి, సీఈఓ సుశాంత్ జోషి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలకు సామాజిక బాధ్యత ఉండాలి

» తరళబాళు మఠాధిపతి శివమూర్తి శివాచార్య



తరళబాళు మఠాధిపతి శివమూర్తి శివాచార్య, మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై తదితరులు

బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలకు స్వలాభంతోపాటు సామాజిక బాధ్యత ఉండాలని సిరిగెరె తరళబాళు జగద్గురు మఠాధిపతి శివమూర్తి శివచార్య అభిప్రాయపడ్డారు. బ్యాటరాయనపురలో ఓ కాంప్లెక్స్‌ను లాంచనంగా ప్రారంభించారు. మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి శివరాజ్ పాటిల్, మంత్రులు ఎస్ఎస్ మల్లికార్జున, భైరతి సురేశ్ తదితరులు పాల్గొన్నారు. స్వామిజీ మాట్లాడుతూ వ్యాపార, పారిశ్రామికవేత్తలు అభివృద్ధి చెందాలని అయితే సమాజంలోని పేద, బడుగు వర్గాలకు తగిన చేయూత ఉండాలన్నారు. బసవరాజ్ బొమ్మై మాట్లాడుతూ లాభాలతోపాటు విశ్వాసం, నైతిక విలువలు అవసరమన్నారు. సూర్య హైట్స్ విశ్వనాథ్ సాధనలను కొనియాడారు.

పద్మశ్రీ శ్రీధర్‌కు లాల్‌బాగ్‌లో సత్కారం



లాల్‌బాగ్‌లో శ్రీధర్‌కు సన్మానం ఇలా..

బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): విద్యానిపుణుడు, సాహితీవేత్త ఎంకే శ్రీధర్‌కు పద్మశ్రీ పురస్కారం దక్కిన సందర్భంగా లాల్‌బాగ్‌లో ప్రత్యేకంగా సత్కరించారు. ఆదివారం లాల్‌బాగ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు గుప్తతోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుప్త మాట్లాడుతూ శ్రీధర్ అంటే బెంగళూరులో అధ్యాపకుడిగా సుపరిచితమని ఆయనకు పద్మశ్రీ దక్కడం పూర్వవిద్యార్థులు, పలువురు అధ్యాపకులతోపాటు నగర ప్రజలు గర్వంగా భావిస్తున్నారన్నారు. శ్రీకృష్ణ ఇంటర్నేషనల్ విద్యాసంస్థల చైర్మన్ రుక్మాంగదనాయుడు, ప్రముఖ వ్యాపారి ఆనందరావ్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఎంకే శ్రీధర్‌కు శాలువా, పూల దండలతో సన్మానం చేశారు.

సైబర్ నేరాల నియంత్రణకు 'కాప్ కనెక్ట్'

» సరికొత్త యాప్ ఆవిష్కరణ



కాప్ కనెక్ట్ యాప్ ఆవిష్కరణలో రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు డాక్టర్ నాగలక్ష్మి చౌదరి తదితరులు

బొమ్మనహళ్ళి, మే 12: మారుతున్న సాంకేతిక యుగంలో సోషల్‌మీడియా ప్రభావంతో సైబర్ నేరాలు అధికమయ్యాయి. వీటిని గుర్తించేలా 'కాప్ కనెక్ట్' యాప్ విడుదల చేశారు. బన్నేరుఘట్టరోడ్డులోని ఏఎంసీ కళాశాలలో శనివారం ఏర్పాటైన సైబర్ సెక్యూరిటీ కెఫె కార్యక్రమంలో కాప్ కనెక్ట్ యాప్‌ను ఆవిష్కరించారు. సైబర్ సెక్యూరిటీ సంస్థ 'జెస్కేలర్ అండ్ ఐసాక్' అనే ప్రైవేట్ సంస్థలు అభివృద్ధి చేసిన ఈ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే వీలుంది. జెస్కేలర్ ఉపాధ్యక్షుడు విశాల్ గౌతమ్ సాంకేతిక వివరాలను వెల్లడించారు. ఒకవేళ ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే బాధితులు యాప్ ద్వారా సైబర్ సిబ్బందిని సంప్రదించవచ్చునన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు డాక్టర్ నాగలక్ష్మి చౌదరి మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు అధికమయ్యాయని వీటి నియంత్రణ, గుర్తించడం పెద్ద సవాల్‌గా ఉందన్నారు. ఇటువంటి తరుణంలో సైబర్ నేరాలను గుర్తించడంలో ప్రభుత్వం సంస్థలు తమ అసహాయకతన వ్యక్తం చేస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ సంస్థలు చొరవ చూపి నేరాల నియంత్రణలో రాణించడం అభినందనీయమన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రైవేట్ సంస్థల సాయం పొందే విషయమై ముఖ్యమంత్రితో చర్చిస్తానన్నారు. సైబర్ సెక్యూరిటీ కెఫె వల్ల కేవలం విద్యార్థులు మాత్రమే కాక ప్రజలు కూడా ప్రయోజనం పొందే అవకాశం ఉందన్నారు. ఇక్కడి కేంద్రం సైబర్ బాధితులకు తగిన నైపుణ్యం, మార్గదర్శనం చేస్తారన్నారు. అన్ని విభాగం విద్యార్థులు అప్లికేషన్ ద్వారా సైబర్ నేరాల నియంత్రణకు సంబంధించి ట్రైనింగ్ పొందాలని ఏఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కుమార్ తెలిపారు. కర్ణాటక డిజిటల్ ఎకానమీ మిషన్ కార్యనిర్వహణాధికారి సంజీవ్‌గుప్తా, ఐసాక్ సంస్థ సంస్థాపకుడు రాజశేఖర్, కాప్ కనెక్ట్ యాప్ సంస్థాపక డైరెక్టర్ పీ ఆనంద నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడిపై దాడి - నిందితుల అరెస్టు



ఆసుపత్రి వద్ద స్థానికుల నిరసన

బంగారపేట, మే 12: ప్రభుత్వ ఆసుపత్రిలో రాత్రివేళ విధి నిర్వహణలో ఉన్న వైద్యాధికారి సుధాకర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి పరారైన ఘటనపై పోలీసులు స్పందించి నిందితులను అరెస్టు చేశారు. దర్శన్, ప్రదీప్, మోహన్‌రాజ్ సహా విజయ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. వివరాలిలా. కేజీఎఫ్‌లో వివాహ కార్యక్రమం కోసం బెంగళూరుకు చెందిన కేజీఎఫ్ తాలూకా క్యాసంబళ్ళి హోబళి నక్కనహళ్ళికి చెందిన విజయ్‌కుమార్ వెళ్తున్న బైక్ శనివారం రాత్రి ప్రమాదానికి గురైంది. గాయపడిన విజయ్‌కుమార్ చికిత్సకోసం వెళ్లగా జిల్లా ఆసుపత్రి ఎస్ఎన్ఆర్‌కు వెళ్లాలని అక్కడి ఆసుపత్రి సిబ్బంది సూచించారు. కాగా కోలారుకు వెళ్లే మార్గంలో బంగారపేట ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చికిత్స ఇవ్వాలని వైద్యాధికారి సుధాకర్‌ను కోరగా ఓపీడీలో చీటీ తీసుకోవాలని సూచించారు. దీంతో ఉద్వేగానికి లోనైన సుధాకర్, అతడి మిత్రులు దర్శన్, ప్రదీప్, మోహన్‌రాజ్ వెంటనే వైద్యుడిని ఇష్టం వచ్చినట్టు తిట్టి దాడి చేస్తారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని నిందితులను అరెస్టు చేశారు.

ఆసుపత్రి వద్ద స్థానికుల నిరసన

విధి నిర్వహణలో ఉన్న వైద్యుడిపై దాడి చేసినా కనీసం పరామర్శకు ఒక అధికారి కూడా రాకపోవడంపై దళిత నాయకులు ఆక్రోశం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. ఘటన జరిగి ఆరు గంటలైనా సంబంధిత శాఖ డీహెచ్ఓ లేదా ఆర్‌సీహెచ్ ఎవరూ రాకపోవడంపై దళిత ప్రముఖుడు హునసనహళ్ళి వెంకటేశ్ ఆక్రోశం వ్యక్తం చేశారు. బంగారపేట ఆసుపత్రిలో పదే పదే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. దీంతో వైద్యులు విధులు నిర్వహించేందుకు వెనుకంజ వేస్తున్నారన్నారు. ప్రామాణిక వైద్యుడిగా సుధాకర్ గుర్తింపు పొందారని అటువంటి డక్టార్‌పై దాడి చేయడం అనుమానుషమన్నారు. సూలికుంటె రమేశ్ మాట్లాడుతూ ఆసుపత్రిలో సిబ్బంది ప్రభుత్వ సదుపాయాలు ప్రజలకు అందడం లేదన్నారు. దీన్ని ప్రశ్నిస్తే ఆసుపత్రిలోని సిబ్బంది దళిత నాయకులపై ఫిర్యాదు చేస్తున్నారని, కాగా వైద్యులకు తగిన రక్షణ లేకపోయిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అప్పేగౌడ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో రద్దీ పెరిగిందని ఈనేపథ్యంలో కనీస భద్రతకోసం ఇద్దరు పోలీసు సిబ్బందిని కేటాయించాలని అధికారి ఇన్‌చార్జ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నంజప్పకు వినతిని ఇచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా దళిత ప్రముఖులు సూలికుంటె ఆనంద్, ఉళదేనహళ్ళి వెంకటేశ్, కళాకారుడు యల్లప్ప, సతీశ్, టీచర్ రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు బీ ఫాంల అందజేత




చంద్రశేఖర్‌కు బీ ఫాం అందజేస్తున్న డీకే శివ కుమార్



డీటీ శ్రీనివాస్



మరితిబ్బేగౌడ



మంజునాథ్‌కుమార్



ఆయనూరు మంజునాథ్

బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఆదివారం బీ ఫాంలు పంపిణీ చేశారు. కేపీసీసీలో ఏర్పాటైన కార్యక్రమంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలకు సంబంధించిన మేరకు అభ్యర్థులు కేకే మంజునాథ్ కుమార్, ఆయనూరు మంజునాథ్, చంద్రశేఖర్ పాటిల్, మరితిబ్బేగౌడ, డీటీ శ్రీనివాస్‌లకు బీ ఫాంలు అందించారు. ఇదే సందర్భంగా డీకే శివకుమార్ మాట్లాడుతూ సమష్టిగా పని చేసి విజయం సాధించాలని అభ్యర్థులకు సూచించారు. మంత్రి మధుబంగారప్పతోపాటు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

రాణించిన జీకే నాయుడు స్కూల్ విద్యార్థులు



నిరీక్ష, వినుతరెడ్డి, సూరజ్‌కుమార్

బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాల్లో నగరంలోని యలహంకలోని జీకే నాయుడు స్కూల్ విద్యార్థులు రాణించారు. పాఠశాల కరెస్పాండెంట్ జీ కిశోర్ నాయుడు ఆదివారం మీడియాతో మాట్లాడుతూ మొత్తం 96 మందికి గాను డిస్టింక్షన్ 20మంది, ఫస్ట్‌క్లాస్‌లో 21మంది, సెకండ్‌క్లాస్ 25 మంది ఇతర విభాగాల్లో 30మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. 587 మార్కులతో నిరీక్ష 94 శాతం ఉత్తీర్ణత సాధించిం దన్నారు. వినుతరెడ్డి 582 మార్కులతో 93 శాతం, సూరజ్ కుమార్ ప్రజాపతి 582 మార్కులతో 93శాతం రాణించి సత్తా చాటారన్నారు.

ఆభరణాల్లో కొత్త డిజైన్లు ఎంపిక చేసుకోండి

బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ఆభరణాలలో ఆధు నిక డిజైన్లు మరింత అందంగా తీర్చేలా ఉన్నాయని మహిళలు వాటిని ఎంపిక చేసుకోవాలని అశికా రంగనాథ్ పిలుపునిచ్చారు. లగ్జరీ సిల్వర్ జ్యువెలరీ బ్రాండ్ గోయాజ్ శాఖను జయనగర్‌లో అశికా లాంఛనంగా ఆరంభించారు. ఈ సందర్భంగా అశికా మాట్లాడుతూ మహిళలకు ఆభరణాలంటే మక్కువ అని శతాబ్దాలకాలంగా ఉండే డిజైన్లకంటే కొత్తవాటికి ప్రాధాన్యత పెరిగిందన్నారు. వధూవరులకోసం కొత్త డిజైన్లు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశంలో వివిధ ప్రాంతాలలోశాఖలు ఉన్నాయని బెంగళూరులో తొలిశాఖను ఆరంభించామన్నారు. ప్రిపాన్ ఇండియా డెలివరీ సౌలభ్యంతోపాటు గ్లోబల్ షిప్పింగ్‌లోనూ వినియోగదారులకోసం శాఖలు ఉన్నాయన్నారు.

హెర్బల్ ఉత్పత్తులకు ప్రాధాన్యం

బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): హెర్బల్ ఉత్పత్తులకు ప్రాధాన్యత పెరుగుతోందని డాబర్ హెర్బల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ అభిషేక్ జగరన్ ప్రకటించారు. ఈమేరకు ఆదివారం బెంగళూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. డాబర్ హెర్బల్ చార్‌కోల్ టూత్‌పేస్ట్ బ్రాండ్‌ను లాంచనంగా విడుదల చేశామన్నారు. రెండు బ్రాండ్‌లను విడుదల చేసినట్టు ప్రకటనలో పేర్కొన్నారు. చార్‌కోల్ టూత్‌పేస్ట్‌లో పళ్ల తెలుపుదనం పెరుగుతుందని, నోట్లోక్రిముల నుంచి రక్షణ సాధ్యమని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతానికి పెద్దల కోసం మాత్రమే టూత్‌పేస్ట్ కేటగిరీని విడుదల చేశామన్నారు. మార్కెటింగ్‌లో తెల్ల టూత్‌పేస్ట్ ఉత్పత్తులతో నిండినవేళ కొత్తగా చార్‌కోల్ భిన్నంగా అందుబాటులోకి వచ్చిందన్నారు.

గేమింగ్ పట్ల అవగాహన

బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ఐ గేమింగ్‌పట్ల అవగాహన ఉంటేనే ఆడాలని ఆర్థిక సలహాదారురాలు అరుణ శర్మ అభిప్రాయపడ్డారు. దేశంలో ఐగేమింగ్‌ల ప్లాట్‌ఫాం పెరుగుతోందన్నారు. అందుకు స్మార్ట్‌ఫోన్‌లు, డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్‌లు, ఇంటర్నెట్ వ్యాప్తి కీలకంగా ఉన్నాయన్నారు. దేశంలో ఈ రంగానికి స్పష్టమైన సమగ్రమైన నిబంధనలు లేకపోవడంతో ఆపరేటర్‌లు, పెట్టుబడిదారులకు అనిశ్చితి ఉందన్నారు. సురక్షితంలేని గేమింగ్ వాతావరణం కోసం మైనర్లు, మోసాల నివారణకు సంబంధించి సమస్యలు పరిష్కరించాల్సి ఉందన్నారు. వినోదరూపంగా గేమింగ్ ప్రజాదరణ, పెరుగుదల ఆదాయ ఉత్పత్తికే కాకుండా ఫౌండర్‌లు, టెక్ డెవలెపర్‌లకు భారీగా ప్రయోజనం చేకూరుతోందన్నారు. ఇటీవలే లండన్‌లో జరిగిన చర్చలోనూ పలు అభిప్రాయాలు వ్యక్తం చేశానన్నారు. ఈ మేరకు నగరంలో ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఉన్నత విద్యకు చేయూత



విద్యార్థిని దీక్షకు ఆర్థిక సహకారం

శిడ్లఘట్ట, మే 12: ఇంజనీరింగ్ డిప్లమో పూర్తి చేసి ఉన్నత విద్యకోసం విదేశానికి వెళ్లేందుకు సిద్ధమైన దీక్ష విద్యార్థిని దీక్షకు బాలాజి సేవా చారిటబుల్ ట్రస్టు తరపున ఆర్థిక చేయూత ఇచ్చారు. ఉన్నత విద్యకోసం విదేశాలకు వెళ్తున్న విద్యార్థిని అభినందించారు. చక్కగా చదివి తల్లిదండ్రులు, గురు వులకు, తాలూకాకు మంచి పేరు తేవాలని బీజేపీ తాలూకా అధ్యక్షుడు, సమాజ సేవకుడు సీకల్‌గౌడ పేర్కొ న్నారు. విద్యార్థిని దీక్ష ఉన్నత విద్యకు ట్రస్టు సహకారం అందించడంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తం అవుతు న్నాయి. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీధర్, నాగరాజు, కాకనాయకనహళ్ళి సోమణ్ణ, యతీశ్, సతీశ్, రాకేశ్, రామయ్య, జగదీశ్‌బాబు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి పాదాల మార్గంలో టెంపో బోల్తా

» నలుగురు భక్తులకు తీవ్రగాయాలు

తిరుమల, మే 12 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ప్రముఖ సందర్శనీయ ప్రదేశమైన శ్రీవారి పాదాల మార్గంలో ఆదివారం ఓ టెంపో ట్రావెలర్ వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. భక్తుల వివరాల మేరకు.. కర్ణాటకలోని హుబ్బళ్ళికి చెందిన యమునప్ప ఆధ్వర్యంలో దాదాపు 20 మంది భక్తులు శ్రీవారి దర్శనార్థం ఆదివారం తిరుమలకు వచ్చారు. ఉదయం దర్శనం ముగించుకుని తిరుమలలో శ్రీవారి పాదాల సందర్శన నిమి త్తం టెంపో ట్రావెలర్ వాహనాన్ని మాట్లాడుకుని వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో ఒక్కసారిగా వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో మర్రెమ్మ, విజయలక్ష్మి, నీలమ్మ, సుధా తీవ్రంగా గాయపడ్డారు. మిగిలిన భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. వాహనం బ్రేక్ ఫెయిల్ కావడంతోనే ప్రమాదం జరిగినట్టు డ్రైవర్ చెప్తుంటే.. సరైన కండీషన్‌లో వాహనం లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని భక్తులు ఆరోపించారు. డిల్లీ రిజిస్ట్రేషన్‌తో ఉన్న వాహనాన్ని తిరుమలకు తిప్పుతూ భక్తుల ప్రాణాలతో చెలగాటమాడటం ఎంతవరకు సమంజసమంటూ ఆగ్రహించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయుల దుర్మరణం

● మరో ఇద్దరికి తీవ్రగాయాలు



ధనుంజయ (ఫైల్)



శ్రీకృష్ణ (ఫైల్)


పావగడ, మే 12 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులు దుర్మరణం పాల య్యారు. పావగడ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనుమపల్లి గేటు వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకృష్ణ(56), ధనుంజయ (57)అనే ఉపాధ్యాయులు మృతిచెందగా వెంకటాచలపతి, ఆర్.ఎం. నరసింహయ్య అనే ఉపాధ్యాయులు తీవ్రంగా గాయపడ్డారు. పావగడ పోలీసులు తెలిపిన వివరాల మేరకు గౌడేటి పాఠశాలలో పనిచేస్తున్న శ్రీ కృష్ణ, పావగడ పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న ధనుంజయ, బూవికాలనీలో పని చేస్తున్న వెంకటాచలపతి, రాజవంతిలో పనిచేస్తున్న నరసింహయ్యలు కలిసి తమస్నేహితులైన శోభ కుమారుడి రిసెప్షన్‌కు తుమకూరుకు కారులో బయలు దేరారు. శుభకార్యం ముగించుకుని శనివారం రాత్రి తిరిగి వస్తుండగా పావగడ సమీపంలో కనుమపల్లి గేటువద్ద రాత్రి 2గంటల సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాల లైటింగ్‌కు డ్రైవింగ్ చేస్తున్న శ్రీకృష్ణ కళ్లుచెమిరి స్టేరింగ్ పక్కకు లాగడంతో పక్కనే ఉన్న రాయిని ఢీ కొట్టారు. శ్రీకృష్ణ, ధనుంజయ అక్కడికక్కడే మృతిచెందగా వెంకటాచలపతి, నరసింహయ్య తీవ్రగాయాల పాలయ్యారు. ఆదివారం ఉదయం 4గంటల సమయంలో పాలవ్యాన్ డ్రైవర్లు చూసి పోలీసులకు, 108కు సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడిన వారిని పావగడ ఆసుపత్రికి తరలించి అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.

విద్యార్థులు, కుటుంబ సభ్యుల్లో తీవ్ర విషాదం



రోదిస్తున్న ధనుంజయ కుటుంబ సభ్యులు

తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల దుర్మరణంతో విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. తమ కు టుంబాలకు పెద్దదిక్కుగా, అండదండగా ఉండేవారు తమ కళ్ల ముందు విగతజీవులుగా పడి ఉం డటంతో బోరున విలపించారు. కుటుంబ సభ్యులు, ఇటు విద్యార్థుల్లోనూ తీవ్ర విషాదం నెలకొంది. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిర్వ హించి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు సీఐ సురేష్ తెలిపారు. ధనుంజయకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె , శ్రీకృష్ణకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆకస్మిక ఘటనతో ఎటు చూసినా విషాద వాతావరణం నెలకొంది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,577.64	1,576.80
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	41	1129
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	13	201
సామర్థ్యం (టీఎంసీలు)	3.43	2.83

రైతు సంఘం పదాధికారుల నియామకం



సంగాత్రేయ పాఠశాలలో రైతు సంఘం పదాధికారులు

కంప్లి, మే 12 : కర్ణాటక రైతు సంఘం హసురుసేన జి కార్తీక్ సంఘం తాలుకా పదాధికారుల నియామకం ఆదివారం జరిగింది. నూతనంగా తాలుకా అధ్యక్షులుగా బీఎం చెన్నప్ప నియమాకమయ్యారు. ఈ సందర్భంగా చెన్నప్ప మాట్లాడుతూ తమపై నమ్మకం వుంచి రైతు సంఘం అధ్యక్షునిగా ఎన్నుకున్నారని, కంప్లి తాలుకాలో రైతుల తరపున న్యాయం కోసం పోరాడుతామన్నారు.. ప్రభుత్వం ద్వారా అందే సదుపాయాలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. వారితో పాటు గౌరవాధ్యక్షులు మంజునాథ్, ఉపాధ్యక్షులు కృష్ణ, రవి, ప్రధాన కార్యదర్శి రామప్ప, రాజా, సంచాలకులుగా బీ నంది, బసవ రాఘవేంద్ర, కార్యదర్శి అలగప్పతో పాటు పరమేష్, విరుపన్న, దేవప్ప, నాగరాజు, వామన్నలు సభ్యులుగా నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో హోస్పేట తాలుకా అధ్యక్షులుగా ఎస్‌జీ మల్లికార్జున, ఉపాధ్యక్షులు రుద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన అరటి



బళ్లారి సిటీ, మే 12: శనివారం రాత్రి ఉరుములతో ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా హొసపేట్ పరిసరాల్లోని రైతుల అరటి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. హగలి బొమ్మనహళ్ళి తాలూకాలోని హొసూరు, బసవదుర్గ, హనగల్, నరసాపురం, హొసూరు, మరయమ్మనహళ్ళి ప్రాంతాలలో పిడుగులు పడి వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. హంపి రైతులు పురాతన కాలువలను నమ్ముకుని అరటి పంటలపై అత్యుత్సాహం చూపడంతో ఈ ప్రాంతంలో నాటిన సుగంధద్రవ్యాల పంటలు వేడిగాలులకు నాశనమయ్యాయి. పట్టణంలో ఏర్పడిన డ్రైనేజీ సమస్యను వెంటనే సిబ్బంది మరమ్మతు చేశారని మున్సిపల్ కమిషనర్ చంద్రప్ప తెలిపారు.

అధిక ఓటింగ్‌లో విజయనగర ఫస్ట్



రవికుమార్

బళ్లారి సిటీ, మే 12: ఈసారి విజయనగర తాలూకాలో గత సంవత్సరం కంటే 7.66శాతం అధికంగా ఓటింగ్ నమోదైందని తాలూకా పంచాయితీ ఈఓ, స్వీప్ కమిటీ తాలూకా అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. విజయనగరం తాలూకాపంచాయితీ కార్యాలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాస్వీప్ కమిటీ ఆధ్వర్యంలో ఈసారి ఇంటింటికీ కరపత్రాల పంపిణీ, బైక్ ర్యాలీ, రంగోలి పోటీల ద్వారా ఉపాధి హామీపథకం కార్మికులకు ఓటింగ్ పై అవగాహన కల్పించామన్నారు. ఈసారి 80శాతానికి పైగా ఓటింగ్ వస్తుందని ప్రచారం జరిగిందని, కానీ 76.58 శాతం ఓటింగ్ మాత్రమే నమోదయిందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌జీఏ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రకాశన నాయక్, అశ్వత్ కుమార్, మల్లికార్జున, వెంకటేశ్, వినయ్‌కుమార్, తేజస్విని, బసమ్మ, మహేంద్రమణి, అశ్విని, పీడీఓ సంఘం తాలూకా అధ్యక్షుడు భరత్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరు నెలల వరకు తల్లిపాలు తప్పనిసరి

బళ్లారి సిటీ, మే 12: పుట్టిన బిడ్డ ఆరునెలల వయస్సు వచ్చేవరకు ఆరోగ్యంగా ఉండాలంటే తల్లిపాలు తప్ప మరేమీ ఇవ్వకూడదని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ అధికారి డాక్టర్ రమేశ్ బాబు విజ్ఞప్తి చేశారు. సిరుగుప్ప తాలూకా తాళూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆడపిల్లలకు జన్మనిచ్చిన తల్లి ఆరోగ్యం గురించి ఆరాతీస్తూ నవజాత శిశువుకు రోజుకు 10-12సార్లు తల్లిపాలు ఇవ్వాలన్నారు. బాల్యంలో ప్రధానంగా 12ప్రాణాంతక వ్యాధులు వస్తాయని వాటి నివారణకు పోలియో వ్యాక్సిన్, బీసీజీ వ్యాక్సిన్, కామెర్లు, హెపటైటిస్ వ్యాక్సిన్, కోరింతదగ్గు ధనుర్వాతం, రోటా వైరస్, ఇన్ఫ్లూయింజా, మీజిల్స్ రుబెల్లా టీకాలు వేయించాలన్నారు. నర్సింగ్ అధికారిణి ఆశాలత, మల్లేశ్వరి పాల్గొన్నారు.

పానీ కా పరేషాన్

- 15రోజుల నుంచి నల్లాల్లో రాని నీరు
- ఎండిపోయిన సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు
- ఎన్నికల ముందు ఊరూరా తిరిగిన కంపెనీల నీటి ట్యాంకర్లు మాయం



బళ్లారి, మే 12(ఆంధ్రజ్యోతి): తాగు నీరు అందక రెండు వారాలు గడిచిపోతున్నాయి. నల్లాల్లో నీళ్లు వస్తాయా..? రావా..? తెలియడం లేదు. ఆర్‌వో ప్లాంటు నుండి తాగునీరు రూ. 10, 20 ఇచ్చి తెచ్చుకుంటున్నా వాటితో అవసరం తీరడం లేదు. ఇక స్నానాలు చేయడం కూడా కష్టం అవుతోంది. ఇలాంటి పరిస్థితి ఏ అరబ్ కంట్రీల్లో ఉంటుందని విన్నాము, కానీ ఇప్పుడు బళ్లారిలోనే ఆ పరిస్థితి ఏర్పడింది.

బళ్లారి నగరంతో పాటు జిల్లాలోనూ తాగు నీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. జిల్లాలోని గ్రామాల్లో వర్షాలు లేని కారణంగా వాటర్ స్టోరేజ్ ట్యాంకులు అన్నీ ఎండిపోయాయి. బళ్లారి నగర ప్రజలకు తాగునీరు అందించేందుకు నిర్మించిన అలీపుర వాటర్ ట్యాంక్ పూర్తిగా నీరు లేక అడుగంటి పోయింది. ట్యాంకులో ఉండే నీటిని పైపుల ద్వారా అందించేందుకు మోటర్ వేస్తే పైపుల్లోకి బురద చేరిపోతోంది. నీరు లేవని అధికారులు కూడా దిగులు చెందుతున్నారు. ఎన్నికల ముందు అష్టకష్టాలు పడి నాయకులు ఏదో ట్యాంకుల ద్వారా అందించారు కానీ ఇక ఎన్నికలు ముగిశాక కొన్ని కంపెనీల ట్యాంకర్లు కనిపించడం లేదు. ఏదో ప్రజలతో ఓట్లు రాబట్టుకునేందుకు ప్రయత్నం చేశారు కానీ శాశ్వతంగా ప్రజలకు తాగునీరు అందించేందుకు కాదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బళ్లారి నగరంలో వివిధ వ్యాపార వర్గాలు, హోటళ్లు, కంపెనీల్లో నీటి వాడకం ఎక్కువ. చాలా మంది నల్లాకు నీరు వదిలిన సమయంలో మోటర్లు వేసుకుని నీరు వాడుకుంటారు. కానీ మోటర్ లేని వారికి నీరు అందడం లేదని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో అయితే నీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. పశువులు తాగడానికి, అలాగే ఇతరత్రా వాడకానికి నీరు దొరకడం లేదు. బోర్లు ఎండిపోయాయి. మోటర్లు వేసినా మోటర్లు కాలిపోతున్నాయే కానీ నీరు ట్యాంకులకు ఎక్కడం లేదు. దీంతో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది.

బళ్లారి జిల్లాలో తుంగభద్ర డ్యాం తలభాగంలోనే ఉంది. అయినా తాగునీరు అందక జనం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఉద్యోగులు, ఇతర ప్రైవేటు కంపెనీల్లో పనిచేసే వారు నీరు ఎప్పుడు వదులుతారో తెలియక డ్యూటీలకు సెలవులు పెట్టి ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. ఇక మరికొందరైయితే బళ్లారి నుండి వేరే ఊళ్లకు బట్టలను ట్రక్కుల్లో వేసుకుని తీసుకెళ్లి అక్కడ నీటితో శుభ్రం చేయించుకుని వస్తున్నారు. ఇంతటి తీవ్ర నీటి ఎద్దడికి కారణం అధికారులు సమ్మర్ ట్యాంకుల్లో సమృద్ధిగా నీరు నిలవజేసుకోకపోవడమే. అధికారుల నిద్రమత్తు, నిర్లక్ష్యం వల్లనే ప్రజలు దాహార్తితో బాధపడుతున్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేకాలంకరణలో రాఘవేంద్రస్వామి

కంప్లి, మే 12 : కంప్లి ఎండీ క్యాంపులోని సాయి బాబా 6వ వార్షికోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఉదయం స్వామి వారికి రాఘవేంద్రస్వామికి జలాభిషేకం, అమృతాభిషేకం, సహస్ర నామావళి, పల్లకి సేవ నిర్వహించారు. పురోహితులు పురుషోత్తమ ఆచారి, కిషోర్ ఆచారిలు పూజలు చేపట్టారు. ఈ పూజల్లో పట్టణంతో పాటు వివిధ గ్రామాల నుంచి క్యాంపుల నుంచి భక్తులు తరలివచ్చి రాఘవేంద్ర స్వామికి మొక్కులు సమర్పించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కంప్లి, మే 12 : కంప్లి తాలుకాలోని దేవలాపురం గ్రామానికి చెందిన శంకరప్ప (25)అలియాస్ మైలారి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వివరాల మేరకు శంకరప్ప రాత్రి జిందాల్‌లో విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై దేవలాపురం గ్రామానికి వెళుతుండగా కణివి మారెమ్మ దేవస్థానం వద్ద అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొన్నాడు. దీంతో తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయం రోడ్డుపైవెళ్లే ప్రజలు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతి చెందిన శంకరప్ప శవాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం బళ్లారి విమ్స్ ఆస్పత్రికు తరలించినట్లు తెలిపారు.

కూటమికి ఓటేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

సిరుగుప్ప, మే 12 : ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లో టీడీపీ, కూటమి అభ్యర్థులను గెలిపించి ఆంధ్రప్రదేశ్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని, తద్వారా మన పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని సరిహద్దు ప్రాంతాల్లో స్థిరపడిన తెలుగు వారు పేర్కొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీకి మద్దతుగా సిరుగుప్ప నుంచి వెళ్లిన తెలుగు ప్రముఖులు కొల్లి శ్రీనివాసరావు, ప్రసాదరావు, మేక శ్రీనివాసరావు, మేక రాజశేఖర్, మైలాపురం క్యాంప్ బాలాజీ, యార్లగడ్డ రవి, సత్యనారాయణల బృందం విజయవాడ, గుంటూరు, గన్నవరం, మంగళగిరి, విజయవాడ నియోజకవర్గాల్లో



టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కలిసిన ప్రముఖులు



గుడివాడ కూటమి అభ్యర్థి వెనిగళ్ల రాముతో కొల్లి శ్రీనివాసరావు, సిరుగుప్ప ప్రముఖులు

కూటమి అభ్యర్థులను గెలిపించుకునేందుకు విస్తృతంగా ప్రచారం చేసింది.. ముఖ్యంగా పీయుజీ ఫౌండేషన్ ఛైర్మన్ కొల్లి శ్రీనివాసరావు సొంత ఊరైన గుడివాడ అభ్యర్థి వెనిగళ్ల రాము గెలుపుకై విస్తృతంగా ప్రచారం చేసి మద్దతు పలికారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ని ఇప్పడం గ్రామంలో జరిగిన రచ్చబండ వద్ద కలిశారు. సొంత రాష్ట్రంపై ఉన్న మమకారంతో తమ కుటుంబ సభ్యులకు, బంధువులకు, స్నేహితులకు తమ గ్రామ ప్రజలకు కూటమి ఆవశ్యకత గురించి వివరించి తమ ఓట్లను కూటమి అభ్యర్థులను వేసి గెలిపించాలని కోరామని కొల్లి శ్రీనివాస రావు, ప్రసాదరావు, లోకేష్ బాబుకు తెలియజేశారు.

ఒక్కటైన 48 జంటలు



48 జంటలకు సామూహిక వివాహాలు నిర్వహిస్తున్న దృశ్యం

కంప్లి, మే 12 : గ్రామాలలో జరిగే సామూహిక వివాహ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. కురుగోడు తాలుకా పరిధిలోని డి కగ్గల్లు గ్రామంలో ఆదివారం సామూహిక వివాహాలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు ఇలాంటి సామూహిక వివాహాల వల్ల ఆర్థికంగా మెరుగుపడతారని తెలిపారు. అలాగే ఒక్కటైన 48 జంటలు ఒడిదొడుకులు ఎదుర్కొని సుఖజీవనం కొనసాగించాలని, ఎన్ని కష్టాలు ఎదురైనా వాటిని ఎదుర్కొని తమ జీవితంలో ముందుకు కొనసాగాలని సూచించారు. అనంతరం ఓబుళేసు తాత మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి సామూహిక వివాహాలు జరగడం వల్ల గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందన్నారు. అలాగే గ్రామంలోని ప్రజలు ముందుకురావడం వల్ల కూడా తమకు ఎంతో సంతోషించదగ్గ విషయమని తెలిపారు. ఓబుళేసు తాత సేవా ట్రస్టు ముందుకొచ్చి 48 జంటలకు సామూహిక వివాహాలు జరిపారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కగ్గల్లు వీరేష్, రఘురామ కృష్ణ, డీ గోపాలప్ప, ఓంకార్, బుచ్చప్ప, అనసూయమ్మ, సదానంద స్వామి, భూతన్న, సిద్దలింగప్ప, గాదెలింగప్ప,చౌడికి లక్ష్మీపతి, గ్రామ పంచాయతీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు, ఓబుళేసు తాత సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆది శంకరాచార్య జయంతి

కంప్లి, మే 12 : 'బహ్మసత్యం జగన్మిథ్య' అన్న వేదవాక్యాన్ని ప్రజలందరికీ అందించిన ఆది శంకరాచార్య జయంతిని కంప్లి పట్టణంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయం ఎండీ క్యాంపులోని వెంకటరమణ దేవస్థానంలో వెంకట నారాయణ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాలూకా కార్యాలయంలో తహసీల్దార్ శంకరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే చిన్నారి సమర్థ శంకరాచార్య వేషభూషణలతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ జయంతిని ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుని శంకరాచార్యకు ప్రత్యేక పూజలు చేపట్టారు.



వెంకటరమణ దేవస్థానంలో శంకరులకు పూజలు, శంకరాచార్య వేషభూషణలతో చిన్నారి సమర్థ



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాగరాజు

బళ్లారిలో లాంఛనంగా శంకరజయంతి

బళ్లారి సిటీ, మే 12: జిల్లా కన్నడ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాంస్కృతిక భవనంలో శ్రీ శంకరాచార్య జయంతిని సరళంగా జరుపుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున జగద్గురు శంకరాచార్య చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతిని లాంఛనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కన్నడ సాంస్కృతిక అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగరాజు, సమాజ ప్రముఖులు పాల్గొన్నారు.

నర్సుల సేవలకు వెలకట్టలేం..



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బ్రహ్మకుమారి స్మిత అక్క

రాయచూరు, మే 12 : ప్రాణాపాయ పరిస్థితుల్లో రోగులుగా ఆస్పత్రికి వచ్చేవారికి సేవలందిస్తున్న నర్సుల సేవలకు వెలకట్టలేమని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రాయచూరు ఇంచార్జ్ సిత్మఅక్క అన్నారు. అతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. కరోనా కష్టకాలంలో రక్తసంబంధికులు, కుటుంబ సభ్యులు సహితం పరస్పరం ఒకరునొకరు ముట్టుకోకుండా జాగ్రతలు పడుతున్న తరుణంలో ఎలాంటి పరిచయం సంబంధం లేని రోగులకు సహితం సేవలందించిన నర్సుల త్యాగబలం వెలకట్టలేనిదన్నారు. అదే సమయంలో పరిసరాల పరిశుభ్రత కోసం పౌరకార్మికులు చేసిన సేవలను మాటలతో వర్ణించలేమన్నారు. ఆరోగ్యపరంగా నర్సులు చేసే సేవలు పారిశుధ్య పరంగా పౌరకార్మికులందించే సేవలు మన ఆరోగ్యాలకు బాసటగా నిలిచాయన్న విషయాన్ని ప్రతిఒక్కరు గుర్తించుకోవాలన్నారు. దేశానికి రైతులు వెన్నెముక అయితే దేశ ఆరోగ్యానికి నర్సులు వెన్నెముకవంటివారని ఆమె అభినందించారు. ఈ సందర్భంగా పలువురు నర్సులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

రచనల ద్వారానే మానవ మనస్తత్వ మార్పు

బళ్లారి సిటీ, మే 12: రచనల ద్వారానే మనస్తత్వాలు మార్చడం సాధ్యమని డాక్టర్ యోగానందరెడ్డి అన్నారు. ఈసందర్భంగా ఆదివారం రచనలను విడుదల చేసిన డాక్టర్ యోగానందరెడ్డి మాట్లాడుతూ వాట్సాప్, ఫోన్, ఫేస్‌బుక్‌ల వల్ల మనస్తత్వం మారదన్నారు. సమాజాన్ని మార్చగలగడం వస్తు, విమర్శనాత్మక రచనలతోనే సాధ్యమవుతుందని, అయితే రచలను చదవటానికి కూడా పాఠకులు కావాలన్నారు. దివాకర్‌నారాయణ పుస్తకంలోని 48 పద్యాలలో వచనకార, దాసుల ప్రభావం కనిపిస్తుందన్నారు. దివాకర్ తాను చూసిన, విన్న వాటిని కవితలుగా మలిచారన్నారు. తన యవ్వనంలోని ఈప్రాంత రైతుల అధ్యాత్మిక చింతనను తన కవితల్లో చిత్రించారన్నారు. తదనంతరం రచయిత డాక్టర్ దివాకర్ గడ్డి మాట్లాడుతూ వృత్తి జీవితంలో చేసినవి, విన్నవి, అనుభవించినవి కవితలుగా రాశానన్నారు. వేదికపై వీరశైవ విద్యావర్ధక సంఘం కార్యదర్శి డాక్టర్ అరవింద్ పాటిల్, సీనియర్ ఆడిటర్ సిరిగేరి పన్నరాజ్ ఉన్నారు. అనంతరం సీనియర్ రచయిత కేశవ్ మాలగి సమకాలీన కథాంశాలపై చర్చాగోష్టి నిర్వహించారు.

హొసూరు జోన్

వైభవంగా వినాయకాలయ కుంభాభిషేకం



పూజల్లో పాల్గొన్న ప్రజలు

హొసూరు, మే 12: హొసూరు కృష్ణానగర్‌లోని శ్రీ వరసిద్ధి వినాయక ఆలయం నిర్మించి పదేళ్లు అయిన సందర్భంగా కుంభాభిషేకం నిర్వహించారు. ఆలయ పదో వార్షికోత్సవంలో ఆదివారం గణపతి హోమం, లక్ష్మి హోమం, నవగ్రహ హోమం, సరస్వతి హోమం, సుదర్శన హోమం నిర్వహించారు. హోమం అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకం అలంకరణ మహాదీపారాధన నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమానికి ఆలయ కమిటీ అధ్యక్షుడు పొన్నుస్వామి, కార్యదర్శి ఆర్ముగం, కోశాధికారి వెంకట్రామన్, ఉపాధ్యక్షుడు రామచంద్రన్, సంయుక్త కార్యదర్శి మురుగన్, ఉప కోశాధికారి ప్రభు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6 గంటలకు సుమంగళీలు దీపారాధన పూజలు చేశారు. వార్షికోత్సవ పూజా కార్యక్రమాలను శివాచార్యులు సుదర్శన్, సిద్దాంకర్, ముత్తుకుమార్, ఆలయ పూజారీ సదుర్శనన్ నిర్వహించారు. ఉత్సవాలలో కృష్ణానగర్, అన్నామలైనగర్, వెంకటేశ్వర నగర్, ఎంటీసి గార్డెన్, గోపీ గార్డన్, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి దర్శనం చేసుకున్నారు.

బంగారం చోరీ

హొసూరు(మత్తిగిరి), మే 12: హొసూరు కార్పొరేషన్ పరిధిలోని మత్తిగిరి సమీపంలోని ఓ ఇంటి తాళం బద్దలు గొట్టి దొంగలు 600 గ్రాముల బంగారు నగలు దోచుకెళ్లారు. సతీష్, నాగరాజన్ మత్తిగిరి సమీపంలో రాయల్ ఆర్కెడ్ నివాస ప్రాంతంలో నివసిస్తున్నారు. బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన భార్య వనిత హొసూరు సమీపంల్లోని టి బారందూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. వీరు రాశీపురం సమీంలోని ఓ రథోత్సవానికి కుటుంబ సమేతంగా వెళ్లినట్లు సమాచారం. సతీష్‌నాగరాజ్ రథోత్సవాన్ని ముగించుకుని ఆదివారం సాయంత్రం కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి వచ్చాడు. ఇంటి ముందు తలుపులు పగలగొట్టి ఉండడంతో షాక్‌కు గురైన సతీష్‌నాగరాజ్ ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉంచిన నగలు ఉన్నాయా లేవా అని గమనించారు. 75 తులాల నగలు చోరీకి గురైనట్లు తెలుస్తోంది. సతీష్ నాగరాజ్ మత్తిగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ టీవీ కెమెరాల్లో రికార్డు అయిన పుటేజీలను పరిశీలిస్తున్నారు. కాపలాదారులు నివాసం ఉంటున్న ప్రాంతంలోనే చోరీ జరగడంపై స్థానికులలో ఆందోళన నెలకొంది.

బస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు

హొసూరు, మే 12 : అన్నాడీఎంకే నేత, ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) 70వ పుట్టినరోజును పార్టీ కార్యకర్తలు, అభిమానులు అర్థవంతంగా ఆచరించారు. వేసవి తాపాన్ని చల్లార్చేందుకు హొసూరు బస్టాండ్ సమీపంలో అన్నాడీఎంకే ఆధ్వర్యంల్లో ప్రజలకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. నీరు మజ్జిగ, పండ్లు పంపిణీ చేశారు. మండుతున్న వేసవి ఎండలను ఎదుర్కోవడానికి అన్నాడీఎంకే ప్రతిరోజూ నీరు మజ్జిగ, పండ్లు, ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. హొసూరు సర్కిల్ కార్యదర్శి మాజీ కౌన్సిలర్ నందకుమార్ ఆధ్వర్యంలో అన్నాడీఎంకే వాలంటీర్లు ప్రజలకు పలు రకాల పండ్లను పంపిణీ చేశారు. అశోక్‌రెడ్డి, బాలుస్వామి, మాదప్ప, రమాచంద్రన్, మణి, చంద్రన్, ప్రేమకుమార్, నటరాజ్, మహిళా జట్టు జమునతో పాటు పలువురు పాల్గొన్నారు.



మజ్జిగ, పండ్లు, ప్రజలకు పంపిణీ చేస్తున్న దృశ్యం

శంకరాచార్య బోధనలు అనుసరణీయం



శంకరాచార్యుల చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సమాజం నేతలు

రాయచూరు, మే 12 : మానవాళి మనుగడ కోసం ఆది శంకరాచార్య చేసిన బోధనలు అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సమాజం నేత కృష్ణమూర్తి పేర్కొన్నారు. జిల్లాయంత్రాంగం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని రంగమందిరంలో నిర్వహించిన ఆదిశంకరాచార్యజయంతి సభలో శంకరాచార్యుల చిత్రపటానికి అధికారులు, సమాజానికి చెందిన నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ సనాతన భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలకు వన్నెతీసుకురావడంతో పాటు అద్వైత వేదాంతంతో దేశ ఔన్యత్యాన్ని ప్రపంచానికి ఎలుగెత్తి చాటిన శంకారాచార్యుల జయంతిని జరుపుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. ఆది శంకరాచార్య బోధనలు ప్రతిఒక్కరు చదవాల్సిన అవసరం ఉందన్నారు. మానవాళిని సక్రమ మార్గంలో నడిపించడంతో పాటు నేను అనే భావం స్థానంలో మేము మనం అనే విధానం వల్ల వనగూడే ప్రయోజనాల గురించి శంకరుల సూచనలు నేటి తరానికి వినిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ప్రతిఒక్కరు శంకరుల బోధనలను వినాలని ఆయన తత్వాలను అవగాహన చేసుకోవాలని తద్వారా జీవితంలో ఉత్తమ స్థానాలను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కన్నడ, సంస్కృతి శాఖ సిబ్బంది ఇస్మాయిల్, వినోద్ కుమార్, సమాజం నేతలు వేణుగోపాల్, వసంతరతావ్, హనుమంతరావ్, శ్రీపాదదేసాయి, హేమచంద్ర, సుబ్రమణ్య, సదానంద, సహజానంద, రమాకాంత, గురురాజ్, నందీశ్, సతీశ్, గోపాల్ జోషి, రమేశ్ జోషి, శ్రీధర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆల్కూరు గ్రామంలో విద్యుత్ తీగలు తగిలి గేదెల మృతి

రాయచూరు, మే 12 : జిల్లాలోని మాన్వి తాలూకా ఆల్కూరు గ్రామ శివారుల్లో విద్యుత్ తీగలు తాకి మూడు గేదెలు మృత్యువాతపడ్డాయి. ఎప్పటిలాగే గ్రామ సమీపంలోని ఆరుబయటపొలాల్లోకి మేతకోసం ఆదివారం బయటికి వెళ్లిన గేదెలు సమీపంలోని ట్రాన్స్ఫర్మర్ వద్దగల విద్యుత్ తీగలు తాకడంతో మృత్యువాతపడ్డాయి. తెగిపడిన విద్యుత్ తీగల్లో విద్యుత్ సరఫరా జరుగుతుండడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఇలాంటి సంఘటనలు పలుసార్లు సంభవించినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గేదెల చావుకు అధికారుల నిర్లక్ష్యమే కారణమంటు గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటన స్థళాన్ని పరిశీలించిన మాన్వి పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా గేదెల మృతితో నష్టపోయిన వారికి పరిహారం అందజేయాలని గ్రామస్థులు కోరారు.